ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 27 అక్టోబరు 2024



ఆరోగ్య గంట



వైద్య పరిభాషలో 'గోల్డెన్ అవర్' అనే పదం వాడతారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు గంటలోపు వైద్యుల వద్దకు చేరుకుంటే కోలుకునే అవకాశాలు వందశాతం ఉంటాయి. వైద్యంలో 'గోల్డెన్ అవర్' ఎంత ముఖ్యమో.. ఆరోగ్యం కోసం నిత్యం గంట సమయం కేటాయించడం అంత ముఖ్యం అంటున్నారు. ఆరోగ్య నిపుణులు. దీనిని ఈ కాలం అతివలు అందిపుచ్చుకున్నారు. ఫిట్‌నెస్ అంటే సిక్స్‌ప్యాక్ అనుకుంటారు కొందరు. అందమైన శరీర ఆకృతి అని మరికొందరి భావన. ఇవేవీ కాదు.. ఫిట్‌నెస్ అంటే ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం, సంపూర్ణ ఆరోగ్యానికి తొలిమెట్టు అంటున్నారు అతివలు. ఇన్నాళ్లు ఫిట్‌నెస్, జిమ్‌లు ఇతర వ్యాయామశాలలకు పురుషులే వెళ్లేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరూ జిమ్‌లకు వెకుతున్నారు. ఆరోగ్యం కోసం చెమటోడ్చుతున్నారు.

- (కడప-ఆంధ్రజ్యోతి)

6

- కసరత్తుల వైపు అతివల చూపు
- అందం.. ఆరోగ్యం.. ఆత్మస్థైర్యం కోసం..
- ఫిట్‌నెస్, జిమ్‌లపై ఆసక్తి
- కడపలో పెరుగుతున్న నయా ట్రెండ్



రోజుకో గంట మీకోసం కేటాయించండి..

నేను గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్నాను. మహిళలు కుటుంబం కోసం రోజంతా కేటాయిస్తుంటారు. మీ కోసం మిమ్మల్ని నమ్ముకున్న వారికోసం రోజులో ఒక గంట ఫిట్‌నెస్‌కోసం కేటాయించండి. టీనేజీ నుంచే కొందరిలో నెలసరి సమస్యలు వస్తున్నాయి. థైరాయిడ్ వస్తోంది. టాబ్లెట్లు వేస్తే తాత్కాలిక ఉపశమనం లభిస్తుంది. రోజూ ఒక గంట వర్కౌట్లు చేస్తే టాబ్లెట్ అవసరంలేదు. మీ జీవితకాలం కూడా పెరుగుతుంది. కార్డియో వర్కౌట్లు, శరీరం, కండరాల గట్టిదనం కోసం వర్కవుట్లు చేయాలి. వర్కవుట్ల వల్ల జాయింట్ పెయిన్స్ రావు. మైండ్ ఫ్రెష్‌గా ఉంటుంది. ఎముకలు బలపడతాయి. బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవు. టీనేజీ నుంచి అందరూ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాల్సిందే.

- డాక్టర్ అపురూప, గైనకాలజిస్ట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కడప



Sunday Special



ఓపెన్‌హౌస్‌లో ఆయుధాల గురించి విద్యార్థులకు తెలియచేస్తున్న పోలీసులు. చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

విద్యార్థుల కోసమే ఓపెన్‌హౌస్

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ అందించే సేవలపై అవగాహన కల్పించడంతో పాటు పోలీసులు వినియోగించే ఆయుధాలు, టెక్నాలజీ, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ పట్ల విద్యార్థులకు అవగాహన కోసమే ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాయచోటిలోని పోలీసు పెరేడ్ మైదానంలో ఓపెన్‌హౌస్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈనెల 26, 27వ తేదీల్లో ఉంటుందని తెలిపారు. అనంతరం ఎస్పీతో పాటు ఇతర పోలీసు అధికారులు ఓపెన్‌హౌస్‌ను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారితో ఆప్యాయంగా మాట్లాడారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ప్రదర్శనలో ఉంచారు. సుశిక్షితులైన సిబ్బందిచే సందర్శనకు విచ్చేసిన ప్రజలకు పోలీసుశాఖ కేసుల ఛేదనలో ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, వివిధ ఆయుధాలు, వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీవార్న్ కెమెరాలు, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్స్ సిగ్నల్స్, స్పీడ్‌గన్ ఇతర పరికరాలు, నేర పరిశోధనలోను, బాంబులను గుర్తించడంతో పోలీసు డాగ్స్ పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు శాఖ వినియోగించే 303 తుపాకీ, 7.62 ఎంఎం సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, 9 ఎంఎం పిస్టల్, కార్బన్, ఏకే 47, టీయర్ గ్యాస్ గన్ తదితర ఆయుధాల పనితీరును ఎస్పీ స్వయంగా వివరించారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు, టీవీ సత్యనారాయణ, శంకరయ్య, చలపతి, రాయచోటి పట్టణ సీఐ, చంద్రశేఖర్, రూరల్ సీఐ వరప్రసాద్, రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, ఆర్ఐ అడ్మిన్ వీజే రామకృష్ణ పాల్గొన్నారు.

డీఎస్ఈవోగా బాధ్యతలు చేపట్టిన సుబ్రమణ్యం



రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారిగా సుబ్రమణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కార్వేటినగర్‌లో పనిచేస్తున్న సుబ్రమణ్యం పదోన్నతిపై అన్నమయ్య జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గుణాత్మక విద్య సాధన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాబోవు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం ద్వారా రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెస్తామన్నారు. ఉపాధ్యాయులు కూడా సమయపాలన పాటిస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా బోధన ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.

ఉల్లి రైతు కంట కన్నీరు



ఎర్రగుంట్ల మార్కెట్‌యార్డులో ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- ఒక్కసారిగా కుదేలైన ధర
- పంట చేతికందే సమయంలో కుళ్లు తెగులు
- తుఫాన్ దెబ్బకు పంట నాశనం
- ఎకరాకు రూ.70 వేలు నష్టపోయామంటున్న రైతులు
- టన్ను కేవలం రూ.10-15 వేలే
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

వ్యవసాయ జూదంలో మరోసారి అన్నదాత ఓడిపోయాడు. కాకపోతే ఈసారి ఉల్లిరైతు వంతు. ఎకరాకు రూ.లక్ష ఖర్చుచేసి ఉల్లిసాగు చేసిన రైతులకు.. ఎకరాకు రూ.70 వేలు నష్టం రావడంతో కంటతడి పెడుతున్నారు. తమ బతుకు జూదంలా మారిపోయిందని కనీస గిట్టుబాటు ధర లేదని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఓ పక్క తుఫాన్, మరో పక్క దళారుల చేతుల్లో చిక్కి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. పంట దిగుబడి వచ్చే సమయానికి తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో కుళ్లురోగం తగిలి గడ్డలు కుళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో తమకు కన్నీరు మాత్రమే మిగిలిందని ఉల్లి రైతులు వాపోతున్నారు.

పులివెందుల/ఎర్రగుంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతు కన్నీరు కార్చే పరిస్థితులు దాపురించాయి. టన్ను ఉల్లి రూ.20వేల నుంచి రూ.35వేల వరకు పలికింది. కానీ ఇపుడు రూ.10వేల నుంచి రూ.15వేల లోపు మాత్రమే పలుకుతోంది. దీంతో ఉల్లి రైతు బావురుమంటున్నారు. ఈ ఏడాది ఉల్లి విస్తీర్ణం ఎక్కువగా ఉంది. పులివెందుల నియోజకవర్గంతో పాటు కమలాపురం, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల్లో ఉల్లి పంట సాగుచేశారు. జిల్లాలో దాదాపు 5వేల ఎకరాల్లో ఉల్లిపంట సాగైంది. అది కూడా రెడు దఫాలుగా సాగుచేశారు. ఈ పంట మే చివరి మాసంలో ఒక దఫా సాగుచేయగా.. మరికొందరు జూన్ మాసం చివరిలో వేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు. ఉల్లి పంట సాగు దగ్గర నుంచి పంట పండే సమయానికి దాదాపు రూ.లక్ష ఖర్చు అవుతుంది. ఉల్లి టన్ను రూ.20వేల నుంచి రూ.35వేలు పలికితే రైతుకు లాభాలు వస్తాయి. అంతకంటే తక్కువ ధర అయితే మాత్రం నష్టాలు చవిచూడాల్సిందే. మే నెలలో సాగైన పంట సెప్టెంబరుకు చేతికొచ్చింది. అపుడు ధర రూ.25వేల నుంచి రూ.35వేలు పలికింది. జూన్‌లో సాగై పంట ఇప్పుడు చేతికొచ్చింది. ఈ సమయంలో వర్షంతో తెగుళ్లు బారిన పడి దిగుబడులు తగ్గడం.. దీనికి తోడు ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

తుఫాన్‌తో రెక్కల కష్టం బూడిదపాలు


తుఫాన్ కారణంగా నేలలో తేమశాతం పెరగడంతో ఉల్లిగడ్డలు కుళ్లిపోతున్నాయి. దీంతో వర్షం తగ్గగానే రైతులు పంటను పీకేసి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమయ్యారు. కానీ నాలుగైదు రోజులుగా ధర రోజురోజుకు పతనమవుతోంది. సోమవారం, మంగళవారం పొలాల వద్ద...

తరువాయి 6లో..



కొమ్మద్దిలో పాడైన ఉల్లిపంటను చూపుతున్న రైతు

పంటను ఎలా అమ్ముకోవాలి..



నాకున్న రెండు ఎకరాల పొలంలో ఉల్లి పంట సాగుచేశాను. ఎకరాకు దాదాపు రూ.80వేలు పెట్టుబడి ఖర్చు అయింది. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. తుఫాన్ కారణంగా కుళ్లుతెగులు కూడా సోకింది. వెంటనే అమ్ముకోకపోతే పంట పాడవుతుంది. కానీ వ్యాపారులు ఎవరు రావడం లేదు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. పంటకు పెట్టిన పెట్టుబడి, కష్టం అంతా మట్టిపాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

- వరికూటి రాజగోపాల్‌రెడ్డి, మర్రిపల్లె, వీరపునాయునిపల్లె మండలం

ఎకరాకు 30 క్వింటాళ్లే దిగుబడి..



ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కాని తుఫాన్ వల్ల పంట బాగా దెబ్బతిని కేవలం 30క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఎరువులు బాగా వేశాం. కానీ దిగుబడి మాత్రం రాలేదు. దీనికి తోడు ధర క్వింటా రూ.1200 నుంచి రూ.1800మాత్రమే పలుకుతోంది. రెండున్నర ఎకరాల్లో ఉల్లిసాగు చేశాను. ఈసారి ఎకరాకు రూ.80వేలకు పైబడి నష్టపోయాను.

- వి.శివకుమార్‌రెడ్డి, రైతు, సుంకేసుల

పార్టీ కోసం శ్రమించిన వారికే కీలక పదవులు

- వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప(ఎడ్యుకేషన్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం శ్రమించిన వారికి కీలక పదవులు వస్తాయని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ బలోపేతంపై దృష్టి సారించామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తలతో చర్చించి పార్టీ పోస్టుల్లో నియామకాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏపీఈఆర్సీ సమావేశం అనగానే కరెంటు బిల్లులు పెంపు అని పత్రికల్లో రాసేవారని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో 6 వేల కోట్లు కరెంటు చార్జీలు పెంచడానికి రంగం సిద్ధం చేశారన్నారు. కరెంటు చార్జీల పెంపు గత ప్రభుత్వంలో జగన్ తప్పుల వల్ల అని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే సుధ, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మందుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

పీలేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఇద్దరు యువకులు మరణించిన సంఘటన నేపథ్యంలో శనివారం పీలేరు పట్టణంలోని మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, పీలేరు పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మదనపల్లె డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి, పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ బాలకృష్ణ శనివారం పట్టణంలోని అన్ని మందుల దుకాణాల్లో అమ్మడవుతున్న కొన్ని మందుల వివరాలను సేకరించారు. మానసిక రోగులకు వైద్యులు సూచించే మందులను వైద్యుల సిఫారసు మేరకు రోగులకే ఇవ్వాలని, ఆయా మందులు తీసుకున్న వారి వివరాలు విధిగా తీసుకోవాలని మందుల దుకాణాల యజమానులను ఆదేశించారు. అనంతరం శనివారం సాయంత్రం పీలేరు పోలీసుస్టేషన్‌లో పట్టణంలోని అన్ని దుకాణాల యజమానులకు అవగాహన సమావేశం నిర్వహించారు.



పీలేరులోని మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న డీఐ, పోలీసులు

వైద్యమిత్రల ఆందోళన

- కనీస వేతనాలు ఇవ్వండి
- జిల్లావ్యాప్తంగా నల్లరిబ్బన్లతో విధులకు హాజరు



మదనపల్లెలో జిల్లా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న ఎన్టీఆర్ వైద్య సేవ వైద్యమిత్రలు

రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు అమలు చేయడం లేదంటూ వైద్యమిత్రలు, టీంలీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా మేనేజర్, ట్రస్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న వైద్యమిత్రలు శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావడంతో పాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథక నిర్వహణ బాధ్యతలను ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పచెబుతుండడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారందరినీ యథావిధిగా కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్హతలకు సంబంధించి నిర్వహించిన పరీక్షలపై హైకోర్టులో నడుస్తున్న వ్యాజ్యంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 29న డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద మహాధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్య గంట

- కసరత్తుల వైపు అతివల చూపు
- అందం.. ఆరోగ్యం.. ఆత్మస్థైర్యం కోసం...
- ఫిట్‌నెస్, జిమ్‌లపై ఆసక్తి
- కడపలో పెరుగుతున్న నయా ట్రెండ్

(కడప-ఆంధ్రజ్యోతి): అందరి జీవితం ఇప్పుడు ఉరుకులు పరుగులుగా ఉంది. జీవనోపాధులతో పాటు జీవన వ్యయమూ బాగా పెరిగింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఇతరత్రా ఉద్యోగాలు చేయడం తప్పనిసరి కావడంతో అందరూ బిజీ అయిపోయారు. మహిళలు మరింత బిజీ అయిపోయారు. ఓ వైపు ఇంటి పని చేసుకుంటూ మరోవైపు ఉద్యోగమో వ్యాపారమో నిర్వహిస్తున్నారు. దీంతో చాలా మంది రకరకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు ఇప్పుడు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మనిషి జీవన విధానం, తీసుకునే ఆహారంలో పెద్దమార్పే తీసుకొచ్చింది. ఒకప్పుడు సినీ నటులు, సెలబ్రిటీలుగా ముద్రపడిన వారు ఫిట్‌నెస్ జిమ్, యోగా చేస్తూ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసేవారు. ఫిట్‌నెస్ అంటే వాళ్లకే అనుకునేవాళ్లు. కానీ ట్రెండ్ మారింది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే ఆలోచన మహిళల్లో మొదలైంది. రోజుకో గంట వ్యాయామం చేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటి దాకా ఫిట్‌నెస్ సెంటర్లు, జిమ్‌లలో రోప్ వర్కౌట్లు, కోర్ వర్కౌట్లు, కార్డియో వర్కౌట్లు, బరువులు ఎత్తడం, జంపింగ్‌జాక్స్ కేవలం పురుషులు మాత్రమే చేస్తుండేవారు. ఇపుడు లేడీస్ కూడా కసరత్తులు చేస్తున్నారు. అందంతో పాటు శరీరం దృఢంగా ఉంచుకునేందుకు పరుగులు తీస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం

మహిళలకు ప్రత్యేకంగా ఫిట్‌నెస్, జిమ్ సెంటర్లు లేవు. అయినప్పటికి వీరు ఫిట్‌నెస్ కోసం పాకులాడుతున్నారు. శారీరకంగా దృఢంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నట్టు. రోజూ గంటపాటు జిమ్ చేస్తే శరీరం స్ట్రాంగ్‌గా కావడమే కాదు.. మానసికంగా దృఢంగా ఉంటారు. ఆత్మస్థైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం ఉంటుంది. అనారోగ్యం దూరం అవుతుంది, బరువు తగ్గవచ్చు. సాధారణంగా పురుషులతో పోల్చుకుంటే మహిళల ఎముకలు బలహీనంగా ఉంటాయి. అయితే వ్యాయామం వల్ల ఎముకలు గట్టిపడతాయి. బరువు అదుపులో ఉంటటుంది. సాధారణ ప్రసవాలు జరిగేందుకు వీలుంటుంది. జీవితం కాలం కూడా పెరుగుతుంది. పీసీఓడీ సమస్యల నుంచి బయటపడవచ్చు.

కడపలో నయా ట్రెండ్

కడపలో అన్ని రకాల వ్యాయామ సెంటర్లు 30కి పైగా ఉన్నాయి. వీటిలో కొన్ని ఫిట్‌నెస్, యోగా, జిమ్ కేంద్రాలు ఉన్నాయి. మహిళలకు ఫిట్‌నెస్ కేంద్రాలు మెట్రోసిటీస్ అయిన చెన్నై, బెంగళూరు, వైజాగ్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో మాత్రమే ఉండేవి. ఇప్పుడు కడపలో ట్రెండ్ మారింది. మహిళల్లో మార్పు వచ్చింది. అటు వృత్తి రీత్యా, కుటుంబం రీత్యా రోజంతా కష్టపడుతున్నారు. మనం బాగుంటేనే మన వృత్తికి, మనం నమ్ముకున్న వారికి న్యాయం చేయగలుగుతాం అని భావిస్తున్నారు. అందుకే చాలా మంది వాకింగ్ చేస్తున్నారు. కొందరు ఇంట్లోనే వ్యాయామం చేస్తున్నారు. దీనితో పాటు అందంపై కూడా శ్రద్ధ పెరిగింది. జంక్‌ఫుడ్ కారణంగా ఒబెసిటీ పెరిగి ఇబ్బంది పడుతుంటారు. నాజుగ్గా ఉండాలని టీనేజీ నుంచి మధ్య వయస్కుల వారికీ ఉంటుంది. అందుకే ఆరోగ్య మంత్రాన్ని పాటిస్తుండడంతో నారీమణులతో ఫిట్‌నెస్ కేంద్రాలు కళకళలాడుతున్నాయి. పురుషులతో సమానంగా ట్రాక్ ప్యాంట్స్, గ్లౌజెస్, టీషర్ట్స్ ధరించి వర్కవుట్లు చేస్తున్నారు. డైట్ ఫాలో అవుతూ కొందరు తమ రూపాన్ని మార్చుకుంటుంటే, మరికొందరు శరీర ఆకృతిని మార్చుకునేందుకు శ్రద్ధ చూపుతున్నారు.

జిమ్‌ల బాట

ఉద్యోగస్తులు, గృహిణులు, విద్యార్థినిలు రోజుకో గంట వ్యాయామం చేయాలని నిర్ణయించుకుంటున్నారు. నాజూగ్గా ఉండేందుకు కొందరు పరితపిస్తుంటారు. బీపీ, షుగర్, ఆర్థరైటిస్ ఇతర అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండాలని అందరూ కోరుకుంటూ ఉంటారు. ఇలాంటివారిలో కొందరు వ్యాయామ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు పురుషులతో సమానంగా అతివలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఇందుకు ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం ముఖ్యం. మనిషి శారీరకంగా దృఢంగా ఉంటేనే ఇవన్నీ సమకూరుతాయి. అందుకే ఆరోగ్యంపై బాగా దృష్టిపెట్టారు. పురుషులతో పాటు మహిళలు జిమ్‌లకు వస్తున్నారు.



బరువు తగ్గేందుకు ఫిట్‌నెస్ అవసరం

శరీరంలో అధిక బరువును తగ్గించుకోవడం కోసం ఫిట్‌నెస్ ఉపయోగపడుతుంది. ఫిట్‌నెస్ వల్ల బరువు తగ్గించుకోవచ్చు. సంపూర్ణ ఆరోగ్యం ఉంటుంది, అందంగా ఉండవచ్చు. నేను రెండేళ్లుగా ఫిట్‌నెస్ కోసం వస్తున్నా. పది కేజీలు తగ్గాను.

- వినూత్న, కడప

గంట సమయం కేటాయించాలి



నేను వృత్తిరీత్యా డాక్టర్‌ను. సర్జరీ కోసం గంటలతరబడి నిలబడాల్సి వస్తుంది. అంత శక్తి కావాలంటే ఫిట్‌నెస్ అవసరం. నాలుగు నెలలుగా ఫిట్‌నెస్‌కు వెళ్తున్నా. నాలో స్ట్రెంత్ పెరిగింది. ఇపుడు నీరసం, అలసట లేదు. ఎంతసేపు అయిన కంటిన్యూగా నిలబడగలుగుతున్నా. ప్రతి ఒక్కరు ఫిట్‌నెస్ కోసం దినచర్యలో గంట కేటాయించాలి.

- బి.దీప్తి, డాక్టర్, ప్లాస్టిక్ సర్జన్, విభ ఆసుపత్రి, కడప

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాల్సిందే



ఇప్పుడంతా ఉరుకుల పరుగుల జీవనం. మనిషి లైఫ్‌స్టైల్ మారిపోయింది. ఫిట్‌నెస్ అనేది ప్రతి ఒక్కరికి అవసరం. ఇందుకోసమే ర్యాబిట్ ఫిట్‌నెస్‌ను కడప కేంద్రంగా స్థాపించాను. ఏపీ, తెలంగాణల్లో మొత్తం పదిచోట్ల సెంటర్లు ఏర్పాటుచేశాం. మహిళల కోసం ప్రత్యేక వర్కౌట్లు డిజైన్ చేశాం. మా వద్ద కార్డియో స్ట్రెంత్ వర్కవుట్లు ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజు గంటపాటు వర్కవుట్లు చేస్తే పీసీఓడీ లాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవు. మనిషి ఆరోగ్యంగా ఉంటే దేన్నైనా సాధిస్తారు.

- తుమ్మలూరు సాయిమహేశ్, ర్యాబిట్ ఫిట్‌నెస్ సెంటర్ సీఈఓ, కడప

చెరువు భూమికే పట్టా ఇచ్చేశారు...

- రెవెన్యూ అధికారుల రూటే సపరేటు..
- రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు

కురబలకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు అధికారం మాదే...మమ్మల్ని ఎవ్వరా అడిగేది అన్న ధోరణితో విచ్చలవిడిగా ప్రవర్తించారు. వైసీపీ నేతల భూదాహానికి చెరువులు, వంకలు కనుమరుగయ్యాయి. దీనిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, ఆ పని మాత్రం చేయకపోగా వారికే మా మద్దతు అన్న విధంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మండలంలోని పలుచోట్ల చెరువులు, డీకేటీ భూములను ఆక్రమించుకోగా ఆ భూములకు పట్టాలను కూడా మంజూరు చేసి అధికారులు తమ భక్తిని చాటుకున్నారు. కాగా చెరువుకు సంబంధించి 6.70 ఎకరాకు రమాదేవి అనే మహిళ పేరుతో పట్టా ఇచ్చిన ఘనత ఇక్కడి రెవెన్యూ అధికారులకే దక్కుతుంది.

కురబలకోట మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండల పరిధిలో భూఆక్రమణదారులకు మద్దతు పలికిన అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. గతంలో వైసీపీ నేతలు చెరువులు, వంకలు, వాగులను అధికార అండతో ఆక్రమించుకుని సొమ్ము చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు అండగా నిలిచి డబ్బుకు ఆశపడి నిబంధనలను తుంగలో తొక్కి చేయకూడని పనులను అడ్డదారుల్లో కానిచ్చేశారు. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీలో 22 ఏళ్ల క్రితం రైతుల కోసం అప్పటి ప్రభుత్వం చెరువును నిర్మించింది. కాగా చెరువు నిర్మాణానికి అవసరమైన భూములను పలువురు రైతుల నుంచి కొనుగోలు చేసి వారికి నష్టపరిహారాన్ని అందజేసింది. సర్వే నెంబర్లు 1871, 1872, 1876, 1877, 1878, 1879, 1881, 1882, 1883లలో 25.01 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి చెరువును నిర్మించారు. దీంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులు, మూగజీవాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అంతేకాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతమంది ఆక్రమణదారుల కళ్లు చెరువుపై పడటంతో ఎలాగైనా ఆ భూములను కాజేయాలని ప్రయత్నాలు చేపట్టారు. దీంతో చెరువును ఆనుకుని రైతులకు చెందిన డీకేటీ భూములను రైతులకు డబ్బు ఆశ చూపి కారుచౌకగా కొనుగోలు చేశారు. అనంతరం ఆ భూములను ఆనుకుని ఉన్న చెరువుకు సంబంధించిన భూములను ఆక్రమించుకుని మొక్కలు నాటి కంచె వేశారు. చెరువుకు సంబంధించిన 1879, 1881 సర్వే నెంబర్ల భూములలో 6.70 ఎకరాల భూమికి 3252 ఖాతా మీద రమాదేవి పేరు మీద రెవెన్యూ అధికారులు పట్టాను మంజూరు చేశారు. ఇందులో భారీ స్థాయిలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ప్రభుత్వ, డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్ బీ అడంగల్ హక్కును కల్పించడం చట్టరీత్యా సాధ్యం కాదు. పేద, నిరుపేదలకు బతుకుదెరువు నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ పట్టా భూమిని వంశపారంపర్యంగా అనుభవించుకోవాలే కానీ ఇతరులకు క్రయ, విక్రయాలు జరిపి ఇతరులకు అప్పగించడం నిబంధనల మేరకు చేయకూడదు. ఒకవేళ భూయజమాని తమ అవసరానికి అమ్మినా, తాకట్టు పెట్టినా నిబంధనల మేరకు చెల్లుబాటు కాదన్న విషయం బహిరంగ రహస్యమే. అలాంటిది చెరువు భూమికి వన్‌బీ కల్పించి అప్పనంగా అప్పగించేశారు. చెరువు ఆక్రమణ విషయమై రెవెన్యూ అధికారులకు పలుమార్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. కాగా ఆక్రమణకు గురైన చెరువును స్వాధీనం చేసుకుని పూర్వపు స్థితిని తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



చెరువు భూమికి పట్టా చేయించుకుని కంచె వేసిన దృశ్యం



చెరువు భూమికి ఇచ్చిన వన్‌బీ

విచారణ చేసి పట్టా రద్దు చేస్తాం

మండలంలోని కంటేవారిపల్లె సమీపంలోని కొత్తచెరువు (లోతువంక)ను చెరువుకు సంబంధించిన భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. గతంలో చెరువు భూమికి సంబంధించిన సర్వే నెంబర్లకు పట్టాను గతంలో మంజూరు చేసినట్లు ఇటీవల నా దృష్టికి వచ్చింది. కాగా చెరువుకు సంబంధించి ఆక్రమణలకు గురైన భూమిని సర్వే చేసి తేలితే ఆక్రమణలను తొలగిస్తాం. దీనిపై విచారణ జరిపి నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పట్టా రద్దు చేస్తాము.

- తపశ్విని, తహసీల్దార్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచండి



సమీక్షలో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్

రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచాలని ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్‌అలీ తెలిపారు. ఓపెన్ స్కూల్ నిర్వహణపై అడ్మిషన్ల పెంపుదలపై శనివారం రాయచోటి డైట్ కళాశాలలో రాయచోటి ప్రాంత ఏఐ కో-ఆర్డినేటర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు వేల అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఈ సంఖ్య మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. పదో తరగతి ఫెయిల్ అయి చదువు మధ్యలో మానేసిన వారికి ఈ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ 200 రూపాయల అపరాధ రుసుంతో ఈనెల 29వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 30, 31వ తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షామీర్‌బాషా, జాబీర్, ఏఐ కో-ఆర్డినేటర్లు అక్బర్‌అలీ, మధుసూదన్, అంజి, హనుమంతురావు, రమణ, ప్రభాకర్, శ్రీనివాసులు, రాజగోపాల్, రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నలుగురు స్మగ్లర్లు

- 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :: సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలోని బొల్లువాండ్లపల్లె సమీపంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామం బొల్లువాండ్లపల్లె సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ దాడుల్లో చిన్నగొల్లపల్లి గ్రామం పూజారివాండ్లపల్లెకు చెందిన పూజారి నాగరాజతో పాటు మరో ముగ్గురు తమిళ స్మగ్లర్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకొని 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే దాడుల సమయంలో ప్రధాన స్మగ్లర్ అయిన దుద్యాల శేఖర్‌రెడ్డి అతడి అసిస్టెంట్ నరసింహులుతో పాటు తూర్పు హరిజనవాడకు చెందిన నాగార్జున, రెడ్డెయ్య, సుబ్రమణ్యం, మరికొంతమంది సంఘటనా స్థలం నుంచి పరారైనట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెబుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ములకలచెరువు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి సుదర్శన్‌నాయక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలులో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. హైజంప్‌లో 1.72 మీటర్లు దూకి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం సాధించాడు. అలాగే ట్రిపుల్‌జంప్‌లో కూడా 12.45 మీటర్లు జంప్ చేసి రెండవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 25వ తేదీ ఝార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ అల్తాఫ్‌భాను, పీడీ సుజావుద్దీన్ తెలిపారు.

క్రీడాకారులను దూషించిన కోచ్..

- రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు

వాల్మీకిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ కోచ్ నాగరాజుపై రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజుకు కొందరు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిల ఉన్నాయి. అండర్-17 బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైన వాల్మీకిపురానికి చెందిన లలిత్‌కుమార్, గిరిధర్, అరవింద్‌లు రెండురోజుల క్రితం చిత్తూరులో శిక్షణ అనంతరం శుక్రవారం సాయంత్రం చిత్తూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరారు. మార్గమధ్యంలో కోచ్ నాగరాజు వాల్మీకిపురం క్రీడాకారులను రైలు ఎక్కిన సమయం నుంచి దుర్భాషలాడారు. అంతేకాక వాల్మీకిపురం క్రీడాకారులకు ట్రైన్‌లో రిజర్వేషన్ లేకపోవడంతో టీసీ చెకింగ్‌కు వచ్చినపుడు జరిమానా కడతామని వారు చెప్పినా వినకుండా కోచ్ వారిని నానా మాటలు అనడంతో ముగ్గురు క్రీడాకారులు ఒక్కొక్కరుగా రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు రైల్వేస్టేషన్‌లలో దిగిపోయి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో క్రీడాకారుల తల్లిదండ్రులు వెళ్లి వారి పిల్లలను వాల్మీకిపురం తీసుకుని వచ్చారు. ఈ విషయమై క్రీడాకారుల తల్లిదండ్రులు పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి, రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజుకు ఫోన్ ద్వారా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ క్రీడల్లో తమ పిల్లల భవిష్యత్తుతో ఆట్లాడుకుంటున్న సంబంధిత కోచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక బాస్కెట్ బాల్ సీనియర్ క్రీడాకారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

ఉల్లి రైతు కంట కన్నీరు

- ఒక్కసారిగా కుదేలైన ధర
- పంట చేతికందే సమయంలో కుళ్లు తెగులు
- తుఫాన్ దెబ్బకు పంట నాశనం

(5వపేజీ తరువాయి)

వ్యాపారులు టన్ను ఉల్లి నాణ్యతను బట్టి రూ.20వేల నుంచి రూ.35వేల వరకు కొనుగోలు చేశారు. రైతులు ఒక్కసారిగా పంటను తొలగించి అమ్మేందుకు సిద్ధమయ్యారు. దీనితో వ్యాపారులు ధరను తగ్గిస్తూ వచ్చారు. రెండు మూడు రోజులుగా రైతులు ఉల్లిగడ్డలను పొలం నుంచి తీసి అమ్మకానికి సిద్ధం చేసినా వ్యాపారులెవరు పొలాలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. పొలాల వద్ద ఉల్లి పంటను రైతులు ఆరబోసుకొని కంటిమీద కునుకు లేకుండా వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు సమీప మార్కెట్‌యార్డులకు తరలిస్తున్నారు. వేముల మండలంలో ఓ రైతు పంటను వ్యాపారి టన్ను రూ.29వేలతో కొనుగోలు చేశారు. ఒకటి రెండురోజుల్లో తూకం వేసుకొని మార్కెట్‌కు తరలిస్తానని అడ్వాన్స్ ఇచ్చాడు. ధర తగ్గడంతో వ్యాపారి రాలేదు. దీనితో పంట పాడవుతుందని రైతు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆ వ్యాపారికి ఫోన్ చేసి చెప్పడంతో అతను వచ్చి రైతునుంచి ఉల్లి కొనుగోలు చేశాడు.



ఉల్లిపంటను తొలగిస్తున్న కూలీలు

గ్రేడింగ్‌తో భారీ నష్టం


జిల్లాలోని పలువురు రైతులు కర్నూలు, తాడేపల్లి మార్కెట్ యార్డులకు ఉల్లిగడ్డలను తరలిస్తున్నారు. కొందరు ఎర్రగుంట్ల మార్కెట్‌యార్డుకు ఉల్లిగడ్డలను అమ్మకానికి తీసుకొస్తున్నారు. అయితే అక్కడ వ్యాపారులు ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్నారు. గ్రేడింగ్ తర్వాత కిలోకు పావు కిలో కూడా రావడంలేదని దీతో తాము భారీగా నష్టపోతున్నామని రెతులు అంటున్నారు. గ్రేడింగ్ తర్వాత వచ్చే ఉల్లిని అలాగే వదిలేయాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి

ఉల్లిసాగుకు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. సేద్యం, నీళ్ల బాడుగ (బోర్లులేని వారికి), విత్తనాలు, ఎరువులు, ఎకరాకు 12సార్లు మందులు, కూలీలు, పిండి, ట్రాక్టర్ బాడుగలు ఇలా మొత్తం ఎకరాకు రూ.90వేల నుంచి లక్షకు చేరుకున్నాయి. ఎకరా ఉల్లిపంటను పీకి కోసేందుకే రూ.22వేల నుంచి రూ.25వేలు ఖర్చవుతోందని అంటున్నారు.

ఎకరాకు 25క్వింటాళ్లే

ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు వర్షం కారణంగా పంట దెబ్బతినడంతో తీవ్ర నిరాశే మిగిలింది. ఎకరాకు కేవలం 25క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కుళ్లుతెగుళ్లతో గడ్డ నాణ్యత లేకపోవడంతో ధర టన్ను రూ.10 వేల నుంచి రూ.15వేలు మాత్రమే పోతోంది. గత సంవత్సరం ఇదే పంట టన్ను రూ.40వేలు కూడా పలకడంతో రైతులకు మంచి లాభం వచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకుని రైతులు ఉల్లిసాగుకు ఎక్కువ మంది ముందుకొచ్చారు. తీరా పంట కోత దశలో తుఫాన్ ప్రభావంతో దిగుబడి బాగా తగ్గింది. దీనికి తోడు రేటుకూడా లేకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వీరుకోరుతున్నారు.



తెగులు సోకడంతో పొలం గట్లపై ఆరబెట్టిన దృశ్యం

మూడెకరాలకు రూ.2.70లక్షలు నష్టం..



మూడెకరాల్లో ఉల్లిసాగు చేశాను. ఎకరాకు కేవలం 20క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సుమారు రూ.95వేలు ఖర్చుచేశాను. తుఫాన్ కారణంగా దిగుబడి బాగా తగ్గింది. దీనికితోడు గడ్డ నాణ్యతగా లేదని ధర తగ్గించేశారు. క్వింటాకు కేవలం రూ.1300మాత్రమే ఇస్తున్నారు. గ్రేడింగ్‌లో 75శాతం గడ్డలు పక్కకు పడేశారు. వాటన్నింటిని పారేయాల్సి వస్తోంది. కనీసం కూలీల ఖర్చు కూడా రాలేదు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలి.

- వడ్డమాని మల్లికార్జునరెడ్డి, రైతు, సుంకేసుల

వర్షాలకు పంట దెబ్బతింది..



ఇటీవల తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు ఉల్లిపంట దెబ్బతింది. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంట పొలాల్లోనే కుళ్లిపోయే పరిస్థితి దాపురించింది. టన్ను ఉల్లి రూ.35 వేలు పలికాయి. నేడు రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే పలుకుతోంది. అదికూడా వ్యాపారులు కొనేందుకు ముందుకు రావడం లేదు.

- ఈశ్వరయ్య, కొమ్మద్ది, వీరపునాయునిపల్లె మండలం

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించండి

- అఖిలపక్ష కమిటీ నేతలు

కడప మారుతీనగర్ అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సందర్భంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన నిధులు కేటాయించేలా ప్రాధాన్యత కల్పించాల్సిన ఆవశ్యకత పాలక ప్రభుత్వాలపై ఉందని అఖిలపక్ష కమిటీ నేతలు నారాయణరెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, ఎస్.ఏ. సత్తార్, దేవర శ్రీకృష్ణ, సగిలి గుర్రప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన చట్టంలో పొందుపరచినట్లు జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామన్న హామీని పాలకులు ఏ మాత్రం పట్టించుకోక కాలయాపన చేయడం విడ్డూరంగా వుందన్నారు. పైపెచ్చు ఎంతసేపూ అమరావతి అంటూ పాటపాడడం సరికాదన్నారు. రాష్ట్రానికి తోడు కేంద్రం కూడా అదే పాటకు వంతపాడుతూ వెనుకబడిన ప్రాంతాలను పూర్తిగా విస్మరించారన్నారు. ఇప్పటికైనా కుట్రపూరిత రాజకీయాలు విడనాడి అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ప్రధానంగా ఈ ప్రాంత గాలేరునగరి ప్రాజెక్ట్ ఇప్పటికే 70శాతం, తెలుగుగంగ ప్రాజెక్ట్ 80 శాతం పనులు మాత్రమే జరిగి నేటికీ అసంపూర్తిగా వున్నాయని, ఆ ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు సిద్ధం కావాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.

ఆర్ట్‌కాంపిటీషన్‌లో ఏఎఫ్‌ఏయూ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రారు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ ఆర్ట్ కాంపిటీషన్‌లో ఏఎఫ్‌ఏయూ విద్యార్థి హరినాయక్ ప్రతిభ చాటారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ జోనల్ రాష్ట్ర స్థాయిలో ఆర్ట్ కాంపిటిషన్ నిర్వహించింది. ఇందులో కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్‌ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెయింటింగ్ మూడో సంవత్సరం విద్యార్థి హరినాయక్ ఎంపికయ్యారు. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో ఢిల్లీలో 23న పోటీలో దేశ వ్యాప్తంగా 71 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వైఎస్ఆర్ ఏఎఫ్‌ఏయూ విద్యార్థి ఎంపికవడం పట్ల వైస్‌ఛాన్సలర్ విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.


విద్యుత్తు ఉద్యోగి బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దువ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న నాయబ్‌రసూల్‌ను మైదుకూరు సబ్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి దినపత్రికలో లైన్‌మెన్ నాయబ్‌రసూల్ వ్యవహార శైలి, అవినీతి పనులపై 'ఎవరైతే నాకేంటి' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీతో స్పందించిన అధికారులు ఆయనను మైదుకూరు సబ్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఈఈ భరణిక్రిష్ణ తెలిపారు. తదుపరి లైన్‌మెన్‌గా ఉండి మండలంలో ఈయన చేసిన అక్రమాలు, అవినీతి పనులు రైతులను, వినియోగదారులను ఇబ్బందికి గురిచేసిన వ్యవహారాలపై విచారణ జరుపనున్నట్లు ఆయన చెప్పారు. విచారణ అనంతరం చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

మైలవరానికి 13000 క్యూసెక్కులు విడుదల

అవుకు నుంచి ఇన్‌ఫ్లో 14000 క్యూసెక్కులు


మైలవరం జలాశయానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గండి కోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయాని కి శనివారం 13000 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి అవు కు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాల్వ ద్వారా 14000 క్యూసెక్కుల కృష్ణాజ లాలు వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.02 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

ర్యాగింగ్ దుష్టసంస్కృతికి చరమగీతం పాడుదాం

ర్యాగింగ్ నేరం, నిషేధం పోస్టరు ఆవిష్కరణ

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ దుష్ట సంస్కృతికి చరమగీతం పాడి స్నేహపూర్వత వాతావరణంలో చదువులు కొనసాగించాలని రిజిస్ట్రారు ఆచార్య పి.పద్మ అన్నారు. విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి, ర్యాగింగ్ నేరం, ర్యాగింగ్ నిషేధం పోస్టరును ఆవిష్కరించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 ప్రకారం శిక్షలను అమలు చేస్తారన్నారు. యాంటిర్యాగింగ్ పర్యవేక్షణ కమిటీలు వసతిగృహాలు, విద్యాలయంలో పనిచేస్తున్నాయని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్‌వీ క్రిష్ణరావు, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేశ్‌బాబు పాల్గొన్నారు.

నంద్యాలంపల్లిలో వ్యక్తిపై దాడి- కేసునమోదు


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఐ

సింహాద్రిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలంపల్లిలో శుక్రవారం రాత్రి మహేశ్వర్‌రెడ్డిపై జరిగిన దాడిపై కేసు నమోదు చేసినట్లు సింహాద్రిపురం ఎస్‌ఐ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఎస్‌ఐ సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి దాడి చేసి గాయపరిచార న్నారు. గాయపడిన మహేశ్వర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గతంలో వారి మధ్య ఉన్న పాతకక్షలవల్లే దాడికి కారణమని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడు మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెడికల్ స్టోర్స్ తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్


మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధురి

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో నిబంధనలు అతిక్రమించి మందులు అమ్ముతున్న 10 మెడికల్ స్టోర్లపై చర్యలకు ఉన్నతాధికారులకు సిపార్సు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మాధురి, జయరాముడు తెలిపారు. ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో మత్తు కోసం యువత.. అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కడప డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి శనివారం నగరంలోని మెడికల్ స్టోర్‌లలో తనిఖీ చేపట్టారు. మత్తు ట్యాబ్లెట్లు విక్రయాలపై రికార్డులను పరిశీలించారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే మత్తు ట్యాబ్లెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖచ్చితం గా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో మత్తుమందు విక్రయాలపై సరైన సమాచారం లేకపోవడంతో చర్యలు కోసం మెడికల్ స్టోర్‌పై నివేదిక తయారు చేసి అధికారులకు పంపించారు. మత్తుమందుల వల్ల యువత పాడవుతున్నారని ఎవరైనా మత్తు ఉన్న మందులు అమ్మితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని మాధురి హెచ్చరించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోబరు26:(ఆంధ్రజ్యోతి) కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శనివారం తమకు వచ్చిన సమాచారం మేరకు చీకలబైలు సమీపంలో నక్కలదిన్నెకు చెందిన శంకర్ నాయక్ కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆయనను అదుపులోకి తీసుకుని కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పాడి గేదె కోసం వెళ్తూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి ● ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం

తండ్రికి తీవ్ర గాయాలు ● ఆస్పత్రిలో కుటుంబీకుల రోదన


ఘటనస్థలంలో గంగాధర్‌రెడ్డి మృతదేహం, (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో) గాయపడిన తండ్రి వెంకటరమణారెడ్డి

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవనం కోసం పాడిగేదెను కొనేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై గంగాధర్‌రెడ్డి (38) దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలం చేరుకుని పరిశీలించారు. ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ అందించిన వివరాల్లోకెళితే....

వీరపునాయునిపల్లె మండలం మొయిళ్లచెరువు వాసి వెంకటరమణారెడ్డి కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. అయితే అరకొర సంపాదనతో కుటుంబం నెట్టుకురావడం భారమైంది. పాడి గేదె ఉంటే చేదోడువాదోడుగా ఉంటుందనుకుని గేదెను తెచ్చుకునేందుకు తండ్రీ కొడుకులు వెంకటరమణారెడ్డి, గంగాధర్‌రెడ్డి శనివారం ఉదయం బుల్లెట్‌లో ఇంటి నుంచి బయలుదేరారు. వేంపల్లె దాటి చక్రాయపేటకు వెళ్తుండగా పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలిస్తూ అధిక వేగంగా వచ్చిన ట్రాక్టర్ బుల్లెట్‌ను ఢీకొంది. దీంతో గంగాధర్‌రెడ్డి తలకు బలమైన గాయాలై రక్తపు మడుగులో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తండ్రి రమణారెడ్డికి కాలు విరిగింది. పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో గాయపడిన తండ్రి రమణారెడ్డిని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని భోరున విలపించారు. యువకుడి భార్య జ్యోతి, బంధువుల రోదనలతో ఆస్పత్రి ఆవరణలో గంభీరవాతావరణం నెలకొంది. భర్త మృతదేహం వద్ద ఎక్కడి పోయినావు లేయ్ అంటూ ఆమె ఏడుస్తున్న దృశ్యం అందరినీ కలచివేసింది. ఇంట్లో పాడి ఉంటే బాగుంటుంది కుటుంబానికి ఆసరాగా ఉంటుందని తెచ్చుకోవడానికి వెళ్తూ ఈ ప్రమాదం జరగడం చూసిన వారంతా ఆవేదన వ్యక్తపరిచారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టీడీపీ మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, ఇతర నేతలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపల్లె వద్ద....



కలసపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిడుగుపల్లె సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి పుల్లారెడ్డిపల్లె వాసి గుడిమె గురయ్య (27) మరణించాడు. ఈ ప్రమాదంలో తంబళ్లపల్లె గ్రామానికి చెందిన మౌళాలికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు బద్వేలు వద్ద ఉన్న సెంచురీ పార్కులో విధులు నిర్వ హిస్తుంటారన్నారు. వీరు ఇంటికి వస్తుండగా సంఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు. మృతునికి 3 నెలల కిందటే వివాహం జరిగింది. సంఘటనా స్థలానికి కలసపాడు ఎస్‌ఐ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధిపత్యం కోసమే కూల్చేశారు

అభయాంజనేయ స్వామి ఆలయంకూల్చివేతలో ఇద్దరు అరెస్టు : డీఎస్పీ కొండయ్యానాయుడు


నిందితులతో డీఎస్పీ కొండయ్యానాయుడు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పూజారుల ఆధిపత్యం కోసమే అభయాంజనేయ స్వామి ఆలయాన్ని కూల్చేశారని మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ వెల్లడించిన వివరాల్లోకెళితే...

ములకలచెరువు మండలం, కనుగొండ అటవీప్రాంతంలో అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. కనుగొండ స్వామి ఆలయ పూజారి హరినాద్‌యాదవ్, అభయాంజనేయస్వామి ఆలయం పూజారి విద్యాసాగర్‌కు కొంత కాలంగా మనస్పర్థలున్నాయి. అభయాంజనేయస్వామి ఆలయం తన అధీనంలోకి తెచ్చుకుని వచ్చే ఆదాయం తాను పొందాలనే ఉద్దేశంతో ఆలయం వదలి వెళ్లాలని విద్యాసాగర్‌ను బెదిరించేవాడు. చివరికి గుడి కూలగొడితే ఖాళీ చేసి వెళ్లిపోతాడని హరినాద్ యాదవ్ పథకం రూపొందించారు. ఇందులో తనకు తెలిసిన నక్కల వెంకటనారాయణ, షేక్ ఈదుల్లా సహకారం తీసుకున్నారు. గుడిలో గుప్తనిధులున్నాయని వారం రోజుల కిందట గుణపాలతో తవ్వారు. వీలుకాకపోవడంతో వెంకటనారాయణ, ఈదుల్లా కలిసి నాటుబాంబులతో 14న గుడిని పేల్చారు. వీటిని కూడా తనకల్లు సమీపంలో మూతపడిన క్వారీ కోసం తెచ్చుకున్న నాలుగు నాటుబాంబుల్లో గుడిపేల్చాడానికి రెండింటిని ఉపయోగించారు. దీంతో మొలకలచెరువు మండలం మదనపల్లె రోడ్డు, తంబళ్లపల్లె క్రాస్ వద్ద ఉన్న సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, టి. సదుం వాసి పెద్దన్న కుమారుడు నక్కల వెంకటనారాయణ, కొక్కంటి క్రాస్ వద్ద ఉన్న రెడ్డిబాష కుమారుడు షేక్ ఈదుల్లాను శుక్రవారం అరెస్టు చేశారు. కాగా ఇందుకు వాడిన మారుతీ కారు, రెండు పెద్ద సమ్మెట్లు, రెండు గడ్డపారలు, ఒక సుత్తి, రాళ్ల చెక్కే ఉలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో హరియాదవ్, లక్ష్మీనారాయణ, రాఘవేంద్రాచారి, మధు, మహేశ్వర్‌రెడ్డి నిందితులను 17న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మిగిలిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, ములకలచెరువు సీఐ రాజారమేష్, ఎస్‌ఐ గాయిత్రి, పోలీసులు పాల్గొన్నారు.

పరీక్షలంటేే భయపడాల్సిన అవసరం లేదు

ఇంపాక్ట్ ప్రతినిధి ప్రేమానందరెడ్డి


కౌన్సెలింగ్ ఇస్తున్న ఇంపాక్ట్ ప్రతినిధి ప్రేమానందరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదు, ఒత్తిడికి లోనవకూడదు ఈ రెండు పోవాలంటే యోగా, ధ్యానం, కొన్ని వ్యాయామాలు చేయాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ కౌన్సెలింగ్ ట్రైనర్ ప్రేమానందరెడ్డి తెలిపారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలబాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలపై శనివారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు తగు సూచనలిస్తూ ఏకాగ్రత కలిగి ఉండి క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎలాంటి వాటినైనా ఎదుర్కోవచ్చన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు


నిందితుడితో సీఐ నాగభూషణ్, రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్

గోపవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడు తిప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల్లోకెళితే....

శ్రీనివాసపురం వాసి తాను పదేళ్లగా తాగుడుకు బానిసవడంతో తనకు తల్లిదండ్రులు తనకు పెళ్లిచేయ లేదు. దీంతో వారిని తరచూ వేధింపుల్లో భాగంగా తన తల్లిని కొడుతున్నప్పుడు ఆమె తన చిన్నాయన ఇంటి వద్దకు వెళ్లిన ప్రతిసారి అతడు తనను తాగుబోతు అని తిట్టేవాడు. మూడు నెలల కిందట తనను చెంప మీద కొట్టడంతో మనసులో పెట్టుకుని అతనిపైకక్ష కట్టి 22న రాత్రి కత్తెరతో పొడిచి హత్య చేసినట్లు తెలిపారు. నిందితున్ని రిమాండుకు పంపించామని రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

బి.కొత్తకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో చౌడమ్మ తీవ్రంగా గాయపడింది. మదనపల్లె పట్టణం నీరుగట్టివారిపల్లె వాసి రవి భార్య చౌడమ్మ కుటుంబీకులతో కలిసి బి.కొత్తకోట కు వచ్చింది. తిరుగు ప్రయాణంలో తన తమ్ముడితో కలిసి మదనపల్లెకు బయలుదేరగా వాహనం కాండ్లమడుగు క్రాస్ వద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించారు.

హెడ్‌కానిస్టేబుల్ వీఎం బాషా సస్పెండ్

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ వీఎం బాషాను సస్పెండ్ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కడప తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో శివక్రిష్ణ స్థలం కొనుగోలు విషయంలో రామక్రిష్ణ, రామాంజనేయరెడ్డితో కలిసి హెడ్ కానిస్టేబుల్ బాషా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని ఫిర్యాదుపై కడప తాలుకా పోలీసుస్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదైంది. విచారించిన ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ బాషాను సస్పెండ్ చేశారు. గతంలో ఇతనిపై ఎర్రచందనం, భూఆక్రమణ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మరో కేసు నమోదు కావడంతో మరోమారు సస్పెండ్‌కు గురయ్యారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

● 96 గ్రాముల బంగారు నగలు స్వాధీనం


వెంకటసుబ్బయ్య - అమర్‌రాజ్‌కుమార్

సిద్దవటం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు చోరీల్లో నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అట్లూరు మండలం చలంగారిపల్లెకు చెందిన గుమ్మాల వెంకటసుబ్బయ్య, బద్వేల్ టౌన్ కుమ్మరి కొట్టాల్లో నివాసం ఉంటున్నారు. అన్నమయ్యజిల్లా అత్తిరాలకు చెందిన జి.కుమార్ అలియాస్ అమర్‌రాజ్‌కుమార్ ప్రస్తుతం కడప తిలక్‌నగర్‌లోని జగనన్నకాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ బైక్‌లో పారిపోతుండగా బాకరాపేట వద్ద అదుపులోకి తీసుకుని 96 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో విజయవాడ, తూర్పుగోదావరి, తిరుపతి, ప్రకాశం, మైదుకూరు, సుండుపల్లె ఓడీ చెరువు, కలువాయి, పొదలకూరుల్లో చోరీలకు పాల్పడ్డారని, వీరిపై 25 కేసులు ఉన్నట్లు తెలిపారు. గతంలో పీడీ యాక్టులో జైలుకు వెళ్లినట్లు వివరించారు.

సేవాభావంతో వైద్యసేవలు అందించాలి


తెల్ల కోటు తొడుగుతున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్యవృత్తి పవిత్రమైనదని అంకితభావంతో వైద్యవిద్య నేర్చుకుని సేవాభావంతో వైద్యసేవలు అందించాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్ అన్నారు. శనివారం వైద్యకళాశాలలో నూ తన వైద్యవిద్యార్థులకు వైట్ కోటును ధరింపజేసి ప్రతిజ్ఞ చేయించారు.

చిన్నారి మృతి

ఖాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చెముళ్లపల్లె పంచాయతీ బీసీ కాలనీలో టిన్నర్ తాగి మూడేళ్ల చిన్నారి కరీముల్లా మృతిచెందాడు. వివాహ వేడుకల్లో భోజనానికి చేయడంలో మంట వెలిగించేందుకు టిన్నర్ వాడి పక్కనబెట్టారు. అదే గ్రామానికి చెందిన మస్తాన్ కుమారుడు కరీముల్లా ఆడుకుంటూ వెళ్లి తీసుకుని తాగాడు. ఎవరూ గమనించకపోవడంతో పిల్లవానికి నోట నురుగు రావడం గమనించి చికిత్స నిమిత్తం కడపరిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. తండ్రిమాత్రం కువైట్‌లో బతుకుదెరువుకోసం వెళ్లాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కలసపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి గ్రామంలో ముత్తుమల జయరామిరెడ్డి పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఉదయం మేతకు తోలుకెళుతుండగా సింగల్‌ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదెకు తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ.60వేల వరకు ఉంటుందని పాడి రైతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆలయంలో హల్‌చల్

నందలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అరవపల్లె ముత్తు మారమ్మ గుడిలో శనివారం మతిస్థిమితం లేని వ్యక్తి భక్తులను భయ భ్రాంతులకు గురి చేశాడు. స్థానిక పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని రైల్వే పోలీసులకు అప్పగించారు.

సుగవాసి బాలసుబ్రమణ్యమే.. టీడీపీ ఇన్‌చార్జి!

రాజంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యమేనని, ఆయనను మార్చే ఉద్దేశం లేదని అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేసినట్లు టీడీపీ నాయకులు వెల్లడించారు. శనివారం రాజంపేట కు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి రాజంపేట టీడీపీలో పరిణామాలపై చర్చించారు. ఇన్‌చార్జి విషయమై కొందరు నాయకులు చేస్తున్న ప్రకటనలతో నియోజకవర్గ టీడీపీ కేడర్‌లో అయోమయం నెలకొందని తాము రాష్ట్ర అధ్యక్షుడికి వివరించగా నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసే అని స్పష్టం చేశారన్నారు. సుగవాసి బాల సుబ్ర మణ్యం ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు తమను ఆదేశించారని తెలిపారు. రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యా సంస్థల అధినేత సంబావు వెంకటరమణ, మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మిరియాల జ్యోతి, అత్తిరాల దేవస్థానం మాజీ అధ్యక్షు డు బండారు బాలయ్య, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి కొండా శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిశెట్టి రమేష్, పార్లమెంట్ కార్యదర్శి సునీత, పట్టణ టీడీపీ నాయకులు ఉద్దండం సుదాకర్, చల్లా సుధాకర్, నాగినేని నాగేశ్వరనాయుడు రాష్ట్ర అధ్యక్షుడిని కలిసినవారిలో ఉన్నారు.



రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌తో రాజంపేట టీడీపీ నాయకులు

సభ్యత్వ నమోదు ప్రారంభం

నియోజకవర్గంలో ఎవరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహి స్తారన్న అంశంపై ఏర్పడిన సంశయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలతో సమసి పోయింది. దీంతో ఆదివారం రాజంపేట మండలం మేకావారిపల్లెలో టీడీపీ సభ్య త్వ నమోదు కార్యక్రమానికి సుగవాసి బాలసుబ్రమణ్యం శ్రీకారం చుట్ట నున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టాలని పార్టీ అదిష్టానం ఆదేశాలు జారీ చేసింది.

ఘర్షణ.. కేసు నమోదు

వీరబల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో ఓ వ్యక్తిపై దాడి చే యడంతో పోలీసులు కేసు నమోదు చేశా రు. మండల పరిధిలోని తాటికుంట పల్లి పంచాయతీ షికారుపాలెంకు చెందిన మనో హర్‌రెడ్డి తండ్రి అంచలయ్యకు సర్వే నెం బర్ 776/2ఏలోని మూడు ఎకరాల 27 సెంట్ల భూమిని ప్రభుత్వం మంజూరు చే సింది. ఆ భూమి విషయమై మనోహర్, గో విందు, శ్రీను మధ్య వివాదం ఏర్పడింది. దీంతో మనోహర్ కోర్టును ఆశ్రయించగా, అతనికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో శుక్రవారం భూమిలోకి వెళ్లిన మనో హార్, అతని భార్యను గోవిందు, శ్రీను, చిన్ని, మేరీ, కమల, నారదకొట్టి గాయపర్చా రు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు.

రికార్డులు తప్పనిసరి

వీరబల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారులు రికార్డులు కలిగి ఉండాలని ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. శని వారం రాయచోటి- రాజంపేట రోడ్డులో ఓడి వీడు సమీ పంలో వాహనాల తనిఖీ నిర్వ హించారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న చమర్తి



రాజంపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): రాజంపేట పార్లమెం ట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు శాశ్వత సభ్యత్వా న్ని తీసుకున్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టీడీపీలో సభ్య త్వం తీసుకుంటే అన్నివిధాల ప్రయోజనం చేకూరుతుందని తెలి పారు. సభ్యత్వం తీసుకున్నవారిలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, పార్లమెంట్ కార్యదర్శి సుబ్రమ ణ్యంనాయుడు, టీఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, మైనార్టీ నాయకులు గు ల్జార్‌బాషా ఉన్నారు.

ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్కరు టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపా నంద రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాఘవరాజపురం లోని టీడీ పీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, యువనాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి 5 మండ లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థిని ప్రతిభ

నందలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురు కుల పాఠశాల విద్యార్థిని జి.ప్రమీల జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చాటి జోనల్ స్థాయికి ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి తెలిపారు. కడప నగరంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈ నెల 25న నిర్వహించిన జిల్లా లెవెల్ సైన్స్ ఎగ్జి బిషన్‌లో 16 మంది జోనల్ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రమీల కర్నూలు జిల్లాలో జరిగే జోనల్ లెవెల్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటుందని తెలిపారు.

రేషన్ దుకాణాల్లో కాటాల తనిఖీ

సిద్దవటం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేషన్ షాపుల్లో ఉన్న కాటాలను శనివారం తనిఖీ చేసినట్లు తూనికల కొలతల ఇన్‌స్పె క్టర్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 16 రేషన్ షాపులకు సంబంధించిన కాటాలు తనిఖీ చేసి కొలతల్లో వ్యత్యాసం ఉన్నవాటిని సరిచేసి సీలు వేశామన్నారు. ఏడాదికొకసారి కాటాల కొలతలను సరి చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్స్ కొండలరావు, శివకుమార్, రేషన్ షాపు డీలర్లు తదితరులు పాల్గొన్నారు

టపాసుల దుకాణాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి

సుండుపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణాల ఏ ర్పాటుకు అనుమతు లు తప్పనిసరిగా తీసు కోవాలని తహసీల్దార్ దైవాధీనం, అగ్నిమాపక అధికారి వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వారపు సంత ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రజల నివాసాలకు దూరంగా ఉండేటట్లు ఎటువంటి ప్రమాదాలు జరగ కుండా ఉండేందుకు అనువైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. రాయవరం, పించ ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు అనుమతించినట్లు అధికారులు తెలిపారు.

ఉపాధి సిబ్బందిపై వేధింపులు తగదు

రైల్వేకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నా యకుల ఒత్తిళ్లకు కే. బుడు గుంటపల్లె ఉపాధి క్షేత్ర స హాయకురాలు సుగుణ ఆస్ప త్రి పాలైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్య క్షుడు పండుగోల మణి, సీఐ టీయూ జిల్లా అధ్యక్షుడు సీ హెచ్ చంద్రశేఖర్ వేర్వేరుగా ఖండించారు. శనివారం ఆస్పత్రి పాలైన సు గుణను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీ య నాయకుల బెదిరింపులు అధికం కావడంతో ఆమె ఆస్పత్రి పాలైందని విమర్శించారు. ఉపాధి ఏపీడీకి కూడా ఈ విషయంపై ఇటీవల వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. ఒత్తిళ్ల కారణంగానే ఏపీఎం రవి కుమార్ మరణించాడని గుర్తు చేశారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే ఉపాధి క్షేత్రసహాయకులను కలుపుకుని ర్యాలీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మం లో సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

మంగంపేటలో గనుల భద్రత వారోత్సవాలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : 39వ గనుల భద్రత వారోత్సవాలను ఏపీఎండీసీ ఆధ్వర్యంలో మంగంపేటలో శనివారం నిర్వహించారు. కేసారం సిమెంట్స్ మైన్స్ భద్రత అధికారి సుదర్శన్‌రెడ్డి, చెట్టినాడు సిమెంట్స్ భద్రత అధికారి సత్యనారాయణ, కేసీపీ సిమెంట్స్ సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి, ఏపీఎండీసీ గనుల్లో భద్రత చర్యలను పరిశీలించారు ఈ సందర్భంగా ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, ఎంబీపీ ప్రాజెక్టు హెడ్ ఆర్.కృష్ణ, డీజీఎం గోపీనాథ్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి...

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రామలక్ష్మి తెలిపారు. శనివారం పట్టణంలోని సిల్వర్ బెల్స్ హైస్కూల్‌లో నిర్వ హించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన బేటీ బచావో...బేటీ పడావో కార్యక్రమం స్ఫూర్తిగా తీసుకో వాలని సూచించారు. దిశ, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం వరల్డ్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్ సెల్‌ఫోన్ వినియోగం, నష్టాలపై వివరించారు. ఎన్జీవో కోఆర్డినేటర్ రవీంద్రనాథ్, ప్రధానో పాధ్యాయురాలు ఎంవీ విజయలక్ష్మి, సిబ్బంది రాహుల్, సోషల్ వర్కర్ శైలజ, పాల్గొన్నారు.

బావికాడపల్లె పాఠశాలలో వైద్యశిబిరం

పుల్లంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బావి కాడపల్లె ప్రాథమిక పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి 5వ తరగతి పిల్లల వరకు ఏఎన్ఎం కళావతి డీపీటీటీడీ వ్యాక్సినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు సాంబశివరావు, ఉపాధ్యాయురాలు శాంతకుమారి, ఆశావర్కర్లు సరస్వతి, పుష్ప పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమా లపై విద్యార్థులకు అవగాహన అవసరమని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్ని క్ కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ మాట్లాడుతూ యువతలో రహదారి భద్రతా చైతన్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్య క్రమాలు ఎంతగానో సహాయపడతాయన్నారు. అనంతరం ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి సుధాకర్ ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను వివరించ డంతో పాటు సమాజ సేవలో రహదారి భద్రతకు ఉన్న ప్రాముఖ్య తను తెలియజేశారు. రోడ్డు భద్రతపై పోస్టర్లు, వీడియోలు ప్రదర్శించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 48 మంది ఎంపిక


నందలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన రగ్బీ జిల్లా జట్టు ఎంపికలకు అనూహ్య స్పందన వచ్చినట్లు ఎంఈవో-2 అనంతకృష్ణ తెలిపారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి మాటా డుతూ ఉభయ జిల్లాల నుంచి అండర్-14, 17 రగ్బీ క్రీడా ఎంపికల్లో సుమారు 120 మంది బాల బాలికలు పాల్గొన్నారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల కు జిల్లా జట్టుకు అండర్-14 విభాగంలో బాలురు 12 మంది, బాలికలు 12 మంది, అండర్-17లో బాలురు 12 మంది, బాలికలు 12 మంది చొప్పున మొత్తం 48 మంది ఎంపికయ్యారన్నారు. ఉపా ధ్యాయులు శ్రీనివాసులు, రగ్బీ ఆర్గనైజర్ పోలంకి గణేష్‌బాబు, కడపజిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కిరణ్, ఎస్జీ ఎఫ్ సెక్రటరీ బి.అరుణ కుమా రి, పీడీలు రాయుడు, నాగమణి, షాహిన్, సుబ్ర మణ్యం, రమేష్, ఓబయ్య పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాక

రాయచోటిటౌన్,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మం త్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈ నెల 27వ తేదీ ఆదివారం రాయచోటికి వస్తున్నట్లు మంత్రి క్యాంపు కార్యాల య సిబ్బంది తెలియజేశారు. 27వ తేదీ ఆది వారం ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి ఫ్లైట్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12.40 గంటలకు కడపకు చేరుకుని ఉమేశ్‌చంద్ర కల్యాణ మండపంలో కడప ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్ర మంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంట లకు రాయచోటి పట్టణంలోని అఫ్జల్ ఫంక్షన్ హాల్ లో తమ అభిమాని వివాహ వేడుకల్లో పాల్గొంటా రు. సాయంత్రం 3 గంటలకు రాయచోటి ఆర్టీసీ బస్టాండులో 8 బస్సులను ప్రారంభిస్తారు. సాయంత్రం 3.30కు స్థానిక ప్రభుత్వ ఉ న్నత పాఠశాల క్రీడా మైదానంలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అన్న మయ్య జిల్లా అండర్-17 బాల, బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల కార్యక్రమంలో పాల్గొంటారు. 5 గంటలకు లక్కిరెడ్డిపల్లె మండలం, చౌటపల్లిలో గురుస్వామి వెంకటేశ్వర అంగప్రదక్షిణ కార్యక్రమం లో పాల్గొంటారని, సాయంత్రం 6 గంటలకు సంబే పల్లె మండలం, రౌతుకుంట గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొం టారని తెలియజేశారు.

10 కోట్లు దాటనున్న బీజేపీ సభ్యత్వాలు

● రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్



బీజేపీ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న సాయిలోకేష్

రాజంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో భారతీయ జనతాపార్టీ 10 కోట్ల సభ్యత్వాల మైలు రాయిని అధిగమించడం తథ్యమని రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయి లోకేష్ తెలిపారు. శనివారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో తొలి క్రి యాశీలక సభ్యత్వాన్ని స్వీకరించిన అనంతరం పలువురితో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించనుందన్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్రమోదీ నేడు ప్రపంచ రాజకీయాల్లో పెద్దన్న పాత్ర పోషిస్తు న్నారన్నారు. జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వై.సురేష్ రాజు, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, జిల్లా కార్యదర్శులు తోట శ్రీని వాసులు, ధీరజ్, రమణయ్య, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సునీత నారాయణవర్మ, మాజీ సర్పంచ్ డాక్టర్ తోట రామయ్య తదితరులు ఉన్నారు.

ఆరోగ్య గంట

కసరత్తుల వైపు అతివల చూపు

అందం.. ఆరోగ్యం.. ఆత్మస్థైర్యం కోసం...

ఫిట్‌నెస్, జిమ్‌లపై ఆసక్తి

కడపలో పెరుగుతున్న నయా ట్రెండ్

(కడప-ఆంధ్రజ్యోతి): అందరి జీవితం ఇప్పుడు ఉరుకులు పరుగులుగా ఉంది. జీవనోపాధులతో పాటు జీవన వ్యయమూ బాగా పెరిగింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఇతరత్రా ఉద్యోగాలు చేయడం తప్పనిసరి కావడంతో అందరూ బిజీ అయిపోయారు. మహిళలు మరింత బిజీ అయిపోయారు. ఓ వైపు ఇంటి పని చేసుకుంటూ మరోవైపు ఉద్యోగమో వ్యాపారమో నిర్వహిస్తున్నారు. దీంతో చాలా మంది రకరకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు ఇప్పుడు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మనిషి జీవన విధానం, తీసుకునే ఆహారంలో పెద్దమార్పే తీసుకొచ్చింది. ఒకప్పుడు సినీ నటులు, సెలబ్రెటీలుగా ముద్రపడిన వారు ఫిట్‌నెస్ జిమ్, యోగా చేస్తూ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసేవారు. ఫిట్‌నెస్ అంటే వాళ్లకే అనుకునేవాళ్లు. కానీ ట్రెండ్ మారింది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే ఆలోచన మహిళల్లో మొదలైంది. రోజుకో గంట వ్యాయామం చేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటి దాకా ఫిట్‌నెస్ సెంటర్లు, జిమ్‌లలో రోప్ వర్కౌట్లు, కోర్ వర్కౌట్లు, కార్డియో వర్కౌట్లు, బరువులు ఎత్తడం, జంపింగ్‌జాక్స్ కేవలం పురుషులు మాత్రమే చేస్తుండేవారు. ఇపుడు లేడీస్ కూడా కసరత్తులు చేస్తున్నారు. అందంతో పాటు శరీరం దృఢంగా ఉంచుకునేందుకు పరుగులు తీస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం

మహిళలకు ప్రత్యేకంగా ఫిట్‌నెస్, జిమ్ సెంటర్లు లేవు. అయినప్పటికి వీరు ఫిట్‌నెస్ కోసం పాకులాడుతున్నారు. శారీరకంగా దృఢంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నట్లు. రోజూ గంటపాటు జిమ్ చేస్తే శరీరం స్ట్రాంగ్‌గా కావడమే కాదు.. మానసికంగా దృఢంగా ఉంటారు. ఆత్మస్థైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం ఉంటుంది. అనారోగ్యం దూరం అవుతుంది, బరువు తగ్గవచ్చు. సాధారణంగా పురుషులతో పోల్చుకుంటే మహిళల ఎముకలు బలహీనంగా ఉంటాయి. అయితే వ్యాయామం వల్ల ఎముకలు గట్టిపడతాయి. బరువు అదుపులో ఉంటటుంది. సాధారణ ప్రసవాలు జరిగేందుకు వీలుంటుంది. జీవితం కాలం కూడా పెరుగుతుంది. పీసీఓడీ సమస్యల నుంచి బయటపడవచ్చు.

కడపలో నయా ట్రెండ్

కడపలో అన్ని రకాల వ్యాయామ సెంటర్లు 30కి పైగా ఉన్నాయి. వీటిలో కొన్ని ఫిట్‌నెస్, యోగా, జిమ్ కేంద్రాలు ఉన్నాయి. మహిళలకు ఫిట్‌నెస్ కేంద్రాలు మెట్రోసిటీస్ అయిన చెన్నై, బెంగళూరు, వైజాగ్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో మాత్రమే ఉండేవి. ఇప్పుడు కడపలో ట్రెండ్ మారింది. మహిళల్లో మార్పు వచ్చింది. అటు వృత్తి రీత్యా, కుటుంబం రీత్యా రోజంతా కష్టపడుతున్నారు. మనం బాగుంటేనే మన వృత్తికి, మనం నమ్ముకున్న వారికి న్యాయం చేయగలుగుతాం అని భావిస్తున్నారు. అందుకే చాలా మంది వాకింగ్ చేస్తున్నారు. కొందరు ఇంట్లోనే వ్యాయామం చేస్తున్నారు. దీనితో పాటు అందంపై కూడా శ్రద్ధ పెరిగింది. జంక్‌ఫుడ్ కారణంగా ఓబెసిటీ పెరిగి ఇబ్బంది పడుతుంటారు. నాజుగ్గా ఉండాలని టీనేజీ నుంచి మధ్య వయస్కుల వారికీ ఉంటుంది. అందుకే ఆరోగ్య మంత్రాన్ని పాటిస్తుండడంతో నారీమణులతో ఫిట్‌నెస్ కేంద్రాలు కళకళలాడుతున్నాయి. పురుషులతో సమానంగా ట్రాక్ ప్యాంట్స్, గ్లౌజెస్, టీషర్ట్స్ ధరించి వర్కవుట్లు చేస్తున్నారు. డైట్ ఫాలో అవుతూ కొందరు తమ రూపాన్ని మార్చుకుంటుంటే, మరికొందరు శరీర ఆకృతిని మార్చుకునేందుకు శ్రద్ధ చూపుతున్నారు.

జిమ్‌ల బాట

ఉద్యోగస్తులు, గృహిణులు, విద్యార్థినిలు రోజుకో గంట వ్యాయామం చేయాలని నిర్ణయించుకుంటున్నారు. నాజూగ్గా ఉండేందుకు కొందరు పరితపిస్తుంటారు. బీపీ, షుగర్, ఆర్థరైటిస్ ఇతర అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండాలని అందరూ కోరుకుంటూ ఉంటారు. ఇలాంటివారిలో కొందరు వ్యాయామ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు పురుషులతో సమానంగా అతివలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఇందుకు ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం ముఖ్యం. మనిషి శారీరకంగా దృఢంగా ఉంటేనే ఇవన్నీ సమకూరుతాయి. అందుకే ఆరోగ్యంపై బాగా దృష్టిపెట్టారు. పురుషులతో పాటు మహిళలు జిమ్‌లకు వస్తున్నారు.



బరువు తగ్గేందుకు ఫిట్‌నెస్ అవసరం

శరీరంలో అధిక బరువును తగ్గించుకోవడం కోసం ఫిట్‌నెస్ ఉపయోగపడుతుంది. ఫిట్‌నెస్ వల్ల బరువు తగ్గించుకోవచ్చు. సంపూర్ణ ఆరోగ్యం ఉంటుంది, అందంగా ఉండవచ్చు. నేను రెండేళ్లుగా ఫిట్‌నెస్ కోసం వస్తున్నా. పది కేజీలు తగ్గాను.

- వినూత్న, కడప

గంట సమయం కేటాయించాలి



నేను వృత్తిరీత్యా డాక్టర్‌ను. సర్జరీ కోసం గంటలతరబడి నిలబడాల్సి వస్తుంది. అంత శక్తి కావాలంటే ఫిట్‌నెస్ అవసరం. నాలుగు నెలలుగా ఫిట్‌నెస్‌కు వెళ్తున్నా. నాలో స్ట్రెంత్ పెరిగింది. ఇపుడు నీరసం, అలసట లేదు. ఎంతసేపు అయిన కంటిన్యూగా నిలబడగలుగుతున్నా. ప్రతి ఒక్కరు ఫిట్‌నెస్ కోసం దినచర్యలో గంట కేటాయించాలి.

- బి.దీప్తి, డాక్టర్, ప్లాస్టిక్ సర్జన్, విభ ఆసుపత్రి, కడప

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాల్సిందే



ఇప్పుడంతా ఉరుకుల పరుగుల జీవనం. మనిషి లైఫ్‌స్టైల్ మారిపోయింది. ఫిట్‌నెస్ అనేది ప్రతి ఒక్కరికి అవసరం. ఇందుకోసమే ర్యాబిట్ ఫిట్‌నెస్‌ను కడప కేంద్రంగా స్థాపించాను. ఏపీ, తెలంగాణల్లో మొత్తం పదిచోట్ల సెంటర్లు ఏర్పాటుచేశాం. మహిళల కోసం ప్రత్యేక వర్కౌట్లు డిజైన్ చేశాం. మా వద్ద కార్డియో స్ట్రెంత్ వర్కవుట్లు ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజు గంటపాటు వర్కవుట్లు చేస్తే పీసీఓడీ లాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవు. మనిషి ఆరోగ్యంగా ఉంటే దేన్నైనా సాధిస్తారు.

- తుమ్మలూరు సాయిమహేశ్, ర్యాబిట్ ఫిట్‌నెస్ సెంటర్ సీఈఓ, కడప

చెరువు భూమికే పట్టా ఇచ్చేశారు...

● రెవెన్యూ అధికారుల రూటే సపరేటు.. ● రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు

కురబలకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు అధికారం మాదే...మమ్మల్ని ఎవ్వరా అడిగేది అన్న ధోరణితో విచ్చలవిడిగా ప్రవర్తించారు. వైసీపీ నేతల భూదాహానికి చెరువులు, వంకలు కనుమరుగయ్యాయి. దీనిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, ఆ పని మాత్రం చేయకపోగా వారికే మా మద్దతు అన్న విధంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మండలంలోని పలుచోట్ల చెరువులు, డీకేటీ భూములను ఆక్రమించుకోగా ఆ భూములకు పట్టాలను కూడా మంజూరు చేసి అధికారులు తమ భక్తిని చాటుకున్నారు. కాగా చెరువుకు సంబంధించి 6.70 ఎకరాకు రమాదేవి అనే మహిళ పేరుతో పట్టా ఇచ్చిన ఘనత ఇక్కడి రెవెన్యూ అధికారులకే దక్కుతుంది.

కురబలకోట మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండల పరిధిలో భూఆక్రమణదారులకు మద్దతు పలికిన అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. గతంలో వైసీపీ నేతలు చెరువులు, వంకలు, వాగులను అధికార అండతో ఆక్రమించుకుని సొమ్ము చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు అండగా నిలిచి డబ్బుకు ఆశపడి నిబంధనలను తుంగలో తొక్కి చేయకూడని పనులను అడ్డదారుల్లో కానిచ్చేశారు. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీలో 22 ఏళ్ల క్రితం రైతుల కోసం అప్పటి ప్రభుత్వం చెరువును నిర్మించింది. కాగా చెరువు నిర్మాణానికి అవసరమైన భూములను పలువురు రైతుల నుంచి కొనుగోలు చేసి వారికి నష్టపరిహారాన్ని అందజేసింది. సర్వే నెంబర్లు 1871, 1872, 1876, 1877, 1878, 1879, 1881, 1882, 1883లలో 25.01 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి చెరువును నిర్మించారు. దీంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులు, మూగజీవాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అంతేకాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతమంది ఆక్రమణదారుల కళ్లు చెరువుపై పడటంతో ఎలాగైనా ఆ భూములను కాజేయాలని ప్రయత్నాలు చేపట్టారు. దీంతో చెరువును ఆనుకుని రైతులకు చెందిన డీకేటీ భూములను రైతులకు డబ్బు ఆశ చూపి కారుచౌకగా కొనుగోలు చేశారు. అనంతరం ఆ భూములను ఆనుకుని ఉన్న చెరువుకు సంబంధించిన భూములను ఆక్రమించుకుని మొక్కలు నాటి కంచె వేశారు. చెరువుకు సంబంధించిన 1879, 1881 సర్వే నెంబర్ల భూములలో 6.70 ఎకరాల భూమికి 3252 ఖాతా మీద రమాదేవి పేరు మీద రెవెన్యూ అధికారులు పట్టాను మంజూరు చేశారు. ఇందులో భారీ స్థాయిలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ప్రభుత్వ, డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్ బీ అడంగల్ హక్కును కల్పించడం చట్టరీత్యా సాధ్యం కాదు. పేద, నిరుపేదలకు బతుకుదెరువు నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ పట్టా భూమిని వంశపారంపర్యంగా అనుభవించుకోవాలే కానీ ఇతరులకు క్రయ, విక్రయాలు జరిపి ఇతరులకు అప్పగించడం నిబంధనల మేరకు చేయకూడదు. ఒకవేళ భూయజమాని తమ అవసరానికి అమ్మినా, తాకట్టు పెట్టినా నిబంధనల మేరకు చెల్లుబాటు కాదన్న విషయం బహిరంగ రహస్యమే. అలాంటిది చెరువు భూమికి వన్‌బీ కల్పించి అప్పనంగా అప్పగించేశారు. చెరువు ఆక్రమణ విషయమై రెవెన్యూ అధికారులకు పలుమార్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. కాగా ఆక్రమణకు గురైన చెరువును స్వాధీనం చేసుకుని పూర్వపు స్థితిని తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



చెరువు భూమికి పట్టా చేయించుకుని కంచె వేసిన దృశ్యం



చెరువు భూమికి ఇచ్చిన వన్‌బీ

విచారణ చేసి పట్టా రద్దు చేస్తాం

మండలంలోని కంటేవారిపల్లె సమీపంలోని కొత్తచెరువు (లోతువంక)ను చెరువుకు సంబంధించిన భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. గతంలో చెరువు భూమికి సంబంధించిన సర్వే నెంబర్లకు పట్టాను గతంలో మంజూరు చేసినట్లు ఇటీవల నా దృష్టికి వచ్చింది. కాగా చెరువుకు సంబంధించి ఆక్రమణలకు గురైన భూమిని సర్వే చేసి తేలితే ఆక్రమణలను తొలగిస్తాం. దీనిపై విచారణ జరిపి నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పట్టా రద్దు చేస్తాము.

- తపశ్విని, తహసీల్దార్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచండి

రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచాలని ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్‌అలీ తెలిపారు. ఓపెన్ స్కూల్ నిర్వహణపై అడ్మిషన్ల పెంపుదలపై శనివారం రాయచోటి డైట్ కళాశాలలో రాయచోటి ప్రాంత ఏఐ కో-ఆర్డినేటర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు వేల అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఈ సంఖ్య మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. పదో తరగతి ఫెయిల్ అయి చదువు మధ్యలో మానేసిన వారికి ఈ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ 200 రూపాయల అపరాధ రుసుంతో ఈనెల 29వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 30, 31వ తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షామీర్‌బాషా, జాబీర్, ఏఐ కో-ఆర్డినేటర్లు అక్బర్‌అలీ, మధుసూదన్, అంజి, హనుమంతురావు, రమణ, ప్రభాకర్, శ్రీనివాసులు, రాజగోపాల్, రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్

పోలీసుల అదుపులో నలుగురు స్మగ్లర్లు

● 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :: సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలోని బొల్లువాండ్లపల్లె సమీపంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చే సుకున్నట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రా మం బొల్లువాండ్లపల్లె సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ దాడుల్లో చిన్నగొల్లపల్లి గ్రామం పూజారివాండ్లపల్లెకు చెందిన పూజారి నాగరాజతో పాటు మరో ముగ్గురు తమిళ స్మగ్లర్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకొని 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే దాడుల సమయంలో ప్రధాన స్మగ్లర్ అయిన దుద్యాల శేఖర్‌రెడ్డి అతడి అసిస్టెంట్ నరసింహులుతో పాటు తూర్పు హరిజనవాడకు చెందిన నాగార్జున, రెడ్డెయ్య, సుబ్రమణ్యం, మరికొంతమంది సంఘటనా స్థలం నుంచి పరారైనట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెబుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మలకలచెరువు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి సుదర్శన్‌నాయక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలులో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. హైజంప్‌లో 1.72 మీటర్లు దూకి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం సాధించాడు. అలాగే ట్రిపుల్‌జంప్‌లో కూడా 12.45 మీటర్లు జంప్ చేసి రెండవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 25వ తేదీ ఝార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ అల్తాఫ్‌భాను, పీడీ సుజావుద్దీన్ తెలిపారు.



క్రీడాకారులను దూషించిన కోచ్..

● రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు

వాల్మీకిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ కోచ్ నాగరాజుపై రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజుకు కొందరు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిల ఉన్నాయి. అండర్-17 బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైన వాల్మీకిపురానికి చెందిన లలిత్‌కుమార్, గిరిధర్, అరవింద్‌లు రెండురోజుల క్రితం చిత్తూరులో శిక్షణ అనంతరం శుక్రవారం సాయంత్రం చిత్తూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరారు. మార్గమధ్యంలో కోచ్ నాగరాజు వాల్మీకిపురం క్రీడాకారులను రైలు ఎక్కిన సమయం నుంచి దుర్భాషలాడారు. అంతేకాక వాల్మీకిపురం క్రీడాకారులకు ట్రైన్‌లో రిజర్వేషన్ లేకపోవడంతో టీసీ చెకింగ్‌కు వచ్చినపుడు జరిమానా కడతామని వారు చెప్పినా వినకుండా కోచ్ వారిని నానా మాటలు అనడంతో ముగ్గురు క్రీడాకారులు ఒక్కొక్కరుగా రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు రైల్వేస్టేషన్‌లలో దిగిపోయి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో క్రీడాకారుల తల్లిదండ్రులు వెళ్లి వారి పిల్లలను వాల్మీకిపురం తీసుకుని వచ్చారు. ఈ విషయమై క్రీడాకారుల తల్లిదండ్రులు పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సావిత్రి, రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజుకు ఫోన్ ద్వారా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ క్రీడల్లో తమ పిల్లల భవిష్యత్తుతో ఆట్లాడుకుంటున్న సంబంధిత కోచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక బాస్కెట్ బాల్ సీనియర్ క్రీడాకారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

ఉల్లి రైతు కంట కన్నీరు

(5వపేజీ తరువాయి)

వ్యాపారులు టన్ను ఉల్లి నాణ్యతను బట్టి రూ.20వేల నుంచి రూ.35వేల వరకు కొనుగోలు చేశారు. రైతులు ఒక్కసారిగా పంటను తొలగించి అమ్మేందుకు సిద్ధమయ్యారు. దీనితో వ్యాపారులు ధరను తగ్గిస్తూ వచ్చారు. రెండు మూడు రోజులుగా రైతులు ఉల్లిగడ్డలను పొలం నుంచి తీసి అమ్మకానికి సిద్ధం చేసినా వ్యాపారులెవరు పొలాలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. పొలాల వద్ద ఉల్లి పంటను రైతులు ఆరబోసుకొని కంటిమీద కునుకు లేకుండా వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు సమీప మార్కెట్‌యార్డులకు తరలిస్తున్నారు. వేముల మండలంలో ఓ రైతు పంటను వ్యాపారి టన్ను రూ.29వేలతో కొనుగోలు చేశారు. ఒకటి రెండురోజుల్లో తూకం వేసుకొని మార్కెట్‌కు తరలిస్తానని అడ్వాన్స్ ఇచ్చాడు. ధర తగ్గడంతో వ్యాపారి రాలేదు. దీనితో పంట పాడవుతుందని రైతు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆ వ్యాపారికి ఫోన్ చేసి చెప్పడంతో అతను వచ్చి రైతునుంచి ఉల్లి కొనుగోలు చేశాడు.



గ్రేడింగ్‌తో భారీ నష్టం

జిల్లాలోని పలువురు రైతులు కర్నూలు, తాడేపల్లి మార్కెట్ యార్డులకు ఉల్లిగడ్డలను తరలిస్తున్నారు. కొందరు ఎర్రగుంట్ల మార్కెట్‌యార్డుకు ఉల్లిగడ్డలను అమ్మకానికి తీసుకొస్తున్నారు. అయితే అక్కడ వ్యాపారులు ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్నారు. గ్రేడింగ్ తర్వాత కిలోకు పావు కిలో కూడా రావడంలేదని దీతో తాము భారీగా నష్టపోతున్నామని రెతులు అంటున్నారు. గ్రేడింగ్ తర్వాత వచ్చే ఉల్లిని అలాగే వదిలేయాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి

ఉల్లిసాగుకు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. సేద్యం, నీళ్ల బాడుగ (బోర్లులేని వారికి), విత్తనాలు, ఎరువులు, ఎకరాకు 12సార్లు మందులు, కూలీలు, పిండి, ట్రాక్టర్ బాడుగలు ఇలా మొత్తం ఎకరాకు రూ.90వేల నుంచి లక్షకు చేరుకున్నాయి. ఎకరా ఉల్లిపంటను పీకి కోసేందుకే రూ.22వేల నుంచి రూ.25వేలు ఖర్చవుతోందని అంటున్నారు.

ఎకరాకు 25క్వింటాళ్లే

ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు వర్షం కారణంగా పంట దెబ్బతినడంతో తీవ్ర నిరాశే మిగిలింది. ఎకరాకు కేవలం 25క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కుళ్లుతెగుళ్లతో గడ్డ నాణ్యత లేకపోవడంతో ధర టన్ను రూ.10 వేల నుంచి రూ.15వేలు మాత్రమే పోతోంది. గత సంవత్సరం ఇదే పంట టన్ను రూ.40వేలు కూడా పలకడంతో రైతులకు మంచి లాభం వచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకుని రైతులు ఉల్లిసాగుకు ఎక్కువ మంది ముందుకొచ్చారు. తీరా పంట కోత దశలో తుఫాన్ ప్రభావంతో దిగుబడి బాగా తగ్గింది. దీనికి తోడు రేటుకూడా లేకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వీరుకోరుతున్నారు.

● ఒక్కసారిగా కుదేలైన ధర

● పంట చేతికందే సమయంలో కుళ్లు తెగులు

● తుఫాన్ దెబ్బకు పంట నాశనం



తెగులు సోకడంతో పొలం గట్లపై ఆరబెట్టిన దృశ్యం

మూడెకరాలకు రూ.2.70లక్షలు నష్టం..



మూడెకరాల్లో ఉల్లిసాగు చేశాను. ఎకరాకు కేవలం 20క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సుమారు రూ.95వేలు ఖర్చుచేశాను. తుఫాన్ కారణంగా దిగుబడి బాగా తగ్గింది. దీనికితోడు గడ్డ నాణ్యతగా లేదని ధర తగ్గించేశారు. క్వింటాకు కేవలం రూ.1300మాత్రమే ఇస్తున్నారు. గ్రేడింగ్‌లో 75శాతం గడ్డలు పక్కకు పడేశారు. వాటన్నింటిని పారేయాల్సి వస్తోంది. కనీసం కూలీల ఖర్చు కూడా రాలేదు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలి.

- వడ్డమాని మల్లికార్జునరెడ్డి, రైతు, సుంకేసుల

వర్షాలకు పంట దెబ్బతింది..



ఇటీవల తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు ఉల్లిపంట దెబ్బతింది. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంట పొలాల్లోనే కుళ్లిపోయే పరిస్థితి దాపురించింది. టన్ను ఉల్లి రూ.35 వేలు పలికాయి. నేడు రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే పలుకుతోంది. అదికూడా వ్యాపారులు కొనేందుకు ముందుకు రావడం లేదు.

- ఈశ్వరయ్య, కొమ్మద్ది, వీరపునాయునిపల్లె మండలం

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించండి

- అఖిలపక్ష కమిటీ నేతలు

కడప మారుతీనగర్ అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సందర్భంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన నిధులు కేటాయించేలా ప్రాధాన్యత కల్పించాల్సిన ఆవశ్యకత పాలక ప్రభుత్వాలపై ఉందని అఖిలపక్ష కమిటీ నేతలు నారాయణరెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, ఎస్.ఎ. సత్తార్, దేవర శ్రీకృష్ణ, నగిలి గుర్రప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన చట్టంలో పొందుపరచినట్లు జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామన్న హామీని పాలకులు ఏ మాత్రం పట్టించుకోక కాలయాపన చేయడం విడ్డూరంగా వుందన్నారు. పైపెచ్చు ఎంతసేపూ అమరావతి అంటూ పాటపాడడం సరికాదన్నారు. రాష్ట్రానికి తోడు కేంద్రం కూడా అదే పాటకు వంతపాడుతూ వెనుకబడిన ప్రాంతాలను పూర్తిగా విస్మరించారన్నారు. ఇప్పటికైనా కుట్రపూరిత రాజకీయాలు విడనాడి అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ప్రధానంగా ఈ ప్రాంత గాలేరునగరి ప్రాజెక్ట్ ఇప్పటికే 70శాతం, తెలుగుగంగ ప్రాజెక్ట్ 80 శాతం పనులు మాత్రమే జరిగి నేటికీ అసంపూర్తిగా వున్నాయని, ఆ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సిద్ధం కావాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.

ఆర్ట్‌కాంపిటీషన్‌లో ఏఎఫ్‌ఏయూ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రారు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ ఆర్ట్ కాంపిటీషన్‌లో ఏఎఫ్‌ఏయూ విద్యార్థి హరినాయక్ ప్రతిభ చాటారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ జోనల్ రాష్ట్ర స్థాయిలో ఆర్ట్ కాంపిటీషన్ నిర్వహించింది. ఇందులో కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెయింటింగ్ మూడో సంవత్సరం విద్యార్థి హరినాయక్ ఎంపికయ్యారు. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో ఢిల్లీలో 23న పోటీలో దేశ వ్యాప్తంగా 71 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ విద్యార్థి ఎంపికవడం పట్ల వైస్‌ఛాన్సలర్ విశ్వనాధకుమార్, రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.

విద్యుత్తు ఉద్యోగి బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దువ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న నాయబ్‌రసూల్‌ను మైదుకూరు సబ్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి దినపత్రికలో లైన్‌మెన్ నాయబ్‌రసూల్ వ్యవహార శైలి, అవినీతి పనులపై 'ఎవరైతే నాకేంటి' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీతో స్పందించిన అధికారులు ఆయనను మైదుకూరు సబ్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఈఈ భరణిక్రిష్ణ తెలిపారు. తదుపరి లైన్‌మెన్‌గా ఉండి మండలంలో ఈయన చేసిన అక్రమాలు, అవినీతి పనులు రైతులను, వినియోగదారులను ఇబ్బందికి గురిచేసిన వ్యవహారాలపై విచారణ జరుపనున్నట్లు ఆయన చెప్పారు. విచారణ అనంతరం చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

మైలవరానికి 13000 క్యూసెక్కులు విడుదల

అవుకు నుంచి ఇన్‌ఫ్లో 14000 క్యూసెక్కులు



మైలవరం జలాశయానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గండి కోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయాని కి శనివారం 13000 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి అవు కు రిజర్వాయిర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాల్వ ద్వారా 14000 క్యూసెక్కుల కృష్ణాజ లాలు వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.02 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

ర్యాగింగ్ దుష్టసంస్కృతికి చరమగీతం పాడుదాం

ర్యాగింగ్ నేరం, నిషేధం పోస్టరు ఆవిష్కరణ

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ దుష్ట సంస్కృతికి చరమగీతం పాడి స్నేహపూర్వత వాతావరణంలో చదువులు కొనసాగించాలని రిజిస్ట్రారు ఆచార్య పి.పద్మ అన్నారు. విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి, ర్యాగింగ్ నేరం, ర్యాగింగ్ నిషేధం పోస్టరును ఆవిష్కరించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 ప్రకారం శిక్షలను అమలు చేస్తారన్నారు. యాంటిర్యాగింగ్ పర్యవేక్షణ కమిటీలు వసతిగృహాలు, విద్యాలయంలో పనిచేస్తున్నాయని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్‌వీ క్రిష్ణరావు, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేశ్‌బాబు పాల్గొన్నారు.

నంద్యాలంపల్లిలో వ్యక్తిపై దాడి- కేసునమోదు



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐ

సింహాద్రిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలంపల్లిలో శుక్రవారం రాత్రి మహేశ్వర్‌రెడ్డిపై జరిగిన దాడిపై కేసు నమోదు చేసినట్లు సింహాద్రిపురం ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి దాడి చేసి గాయపరిచారన్నారు. గాయపడిన మహేశ్వర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గతంలో వారి మధ్య ఉన్న పాతకక్షలవల్లే దాడికి కారణమని ఎస్ఐ తెలిపారు. బాధితుడు మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెడికల్ స్టోర్స్ తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్



మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధురి

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో నిబంధనలు అతిక్రమించి మందులు అమ్ముతున్న 10 మెడికల్ స్టోర్లపై చర్యలకు ఉన్నతాధికారులకు సిపార్సు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మాధురి, జయరాముడు తెలిపారు. ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో మత్తు కోసం యువత.. అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కడప డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి శనివారం నగరంలోని మెడికల్ స్టోర్లలో తనిఖీ చేపట్టారు. మత్తు ట్యాబ్లెట్లు విక్రయాలపై రికార్డులను పరిశీలించారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే మత్తు ట్యాబ్లెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖచ్చితం గా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో మత్తుమందు విక్రయాలపై సరైన సమాచారం లేకపోవడంతో చర్యలు కోసం మెడికల్ స్టోర్‌పై నివేదిక తయారు చేసి అధికారులకు పంపించారు. మత్తుమందుల వల్ల యువత పాడవుతున్నారని ఎవరైనా మత్తు ఉన్న మందులు అమ్మితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని మాధురి హెచ్చరించారు.

పేకాటకాయుళ్ల అరెస్ట్ - నగదు స్వాధీనం

బి.కొత్తకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నూరపువారిపల్లె పంచాయతీ యాలగిరిపల్లె శివారులోని వలసకొండలో పేకాడుతున్న పదిమందిని శనివారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు. వలసకొండలో జోరుగా పేకాట జరుగుతున్న పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.15550 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

పాడి గేదె కోసం వెళ్తూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి ● ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం
తండ్రికి తీవ్ర గాయాలు ● ఆస్పత్రిలో కుటుంబీకుల రోదన



ఘటనస్థలంలో గంగాధర్‌రెడ్డి మృతదేహం, (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో) గాయపడిన తండ్రి వెంకటరమణారెడ్డి

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవనం కోసం పాడిగేదెను కొనేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై గంగాధర్‌రెడ్డి (38) దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలం చేరుకుని పరిశీలించారు. ఎస్ఐ తిరుపాల్‌నాయక్ అందించిన వివరాల్లోకెళితే....

వీరపునాయునిపల్లె మండలం మొయిళ్లచెరువు వాసి వెంకటరమణారెడ్డి కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. అయితే అరకొర సంపాదనతో కుటుంబం నెట్టుకురావడం భారమైంది. పాడి గేదె ఉంటే చేదోడువాదోడుగా ఉంటుందనుకుని గేదెను తెచ్చుకునేందుకు తండ్రీ కొడుకులు వెంకటరమణారెడ్డి, గంగాధర్‌రెడ్డి శనివారం ఉదయం బుల్లెట్‌లో ఇంటి నుంచి బయలుదేరారు. వేంపల్లె దాటి చక్రాయపేటకు వెళ్తుండగా పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలిస్తూ అధిక వేగంగా వచ్చిన ట్రాక్టర్ బుల్లెట్‌ను ఢీకొంది. దీంతో గంగాధర్‌రెడ్డి తలకు బలమైన గాయాలై రక్తపు మడుగులో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తండ్రి రమణారెడ్డికి కాలు విరిగింది. పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో గాయపడిన తండ్రి రమణారెడ్డిని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని భోరున విలపించారు. యువకుడి భార్య జ్యోతి, బంధువుల రోదనలతో ఆస్పత్రి ఆవరణలో గంభీరవాతావరణం నెలకొంది. భర్త మృతదేహం వద్ద ఎక్కడి పోయినావు లేయ్ అంటూ ఆమె ఏడుస్తున్న దృశ్యం అందరినీ కలచివేసింది. ఇంట్లో పాడి ఉంటే బాగుంటుంది కుటుంబానికి ఆసరాగా ఉంటుందని తెచ్చుకోవడానికి వెళ్తూ ఈ ప్రమాదం జరగడం చూసిన వారంతా ఆవేదన వ్యక్తపరిచారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టీడీపీ మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, ఇతర నేతలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపల్లె వద్ద....



కలసపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిడుగుపల్లె సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి పుల్లారెడ్డిపల్లె వాసి గుడిమె గురయ్య (27) మరణించాడు. ఈ ప్రమాదంలో తంబళ్లపల్లె గ్రామానికి చెందిన మౌళాలికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు బద్వేలు వద్ద ఉన్న సెంచురీ పార్కులో విధులు నిర్వ హిస్తుంటారన్నారు. వీరు ఇంటికి వస్తుండగా సంఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు. మృతునికి 3 నెలల కిందటే వివాహం జరిగింది. సంఘటనా స్థలానికి కలసపాడు ఎస్ఐ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): పీటీఎం పోలీస్ స్టేషన్‌లో పోలీసులు నిర్వర్తించే విధులపై విద్యార్థులకు స్థానిక ఎస్ఐ అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 21 నుంచి ఈనెల 31 వరకు జరిగే పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా శనివారం పోలీసు స్టేషన్‌లో పోలీసులు నిర్వర్తించే విధులు, పోలీస్ ఎఫ్ఐఆర్, లాకప్, క్రిమినల్ చట్టాలు వాటి వివరాలపై విద్యార్థులకు ఎస్ఐ వారికి వివరించారు. స్థానిక పీటీఎం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను పీటీఎం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీసుల విధులు, వారు చేయవలసిన పనులపై విద్యార్థులకు వివరించారు. పోలీసులు ప్రజల పట్ల ఎలా మసులుకోవాలి, పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలంటే ఎలా చేయాలి, ఎవరితో మాట్లాడాలి, ఏవిధంగా చట్టాలను వినియోగించుకోవాలి, విద్యార్థుల తెలిసే అసాంఘిక కార్యక్రమాలపై వివరించారు. పోలీసులు ప్రజలు స్నేహపూర్వకంగా మెలిగేందుకు ప్రజల్లో ముఖ్యంగా అవగాహన అవసరమని, విద్యార్థులకు పోలీసులంటే భయం ఉండకూడదు. ఏదైనా తమ కళ్లముందు తప్పు జరుగుతుంటే పోలీసులకు తెలియచేయాలన్నారు. పోలీసులు, ప్రజలకు అనుసందానంగా ఉంటే నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉండదన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసమే కూల్చేశారు

ఆలయంకూల్చివేతలో ఇద్దరు అరెస్టు : డీఎస్పీ



నిందితులతో డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పూజారుల ఆధిపత్యం కోసమే అభయాంజనేయ స్వామి ఆలయాన్ని కూల్చేశారని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ వెల్లడించిన వివరాల్లోకెళితే...

ములకలచెరువు మండలం, కనుగొండ అటవీప్రాంతంలో అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. కనుగొండ స్వామి ఆలయ పూజారి హరినాద్‌యాదవ్, అభయాంజనేయస్వామి ఆలయం పూజారి విద్యాసాగర్‌కు కొంత కాలంగా మనస్పర్థలున్నాయి. అభయాంజనేయస్వామి ఆలయం తన అధీనంలోకి తెచ్చుకుని వచ్చే ఆదాయం తాను పొందాలనే ఉద్దేశంతో ఆలయం వదలి వెళ్లాలని విద్యాసాగర్‌ను బెదిరించేవాడు. చివరికి గుడి కూలగొడితే ఖాళీ చేసి వెళ్లిపోతాడని హరినాథ్ యాదవ్ పథకం రూపొందించారు. ఇందులో తనకు తెలిసిన నక్కల వెంకటనారాయణ, షేక్ ఈదుల్లా సహకారం తీసుకున్నారు. గుడిలో గుప్త నిధులున్నాయని వారం రోజుల కిందట గుణపాలతో తవ్వారు. వీలుకాకపోవడంతో వెంకటనారాయణ, ఈదుల్లా కలిసి నాటుబాంబులతో 14న గుడిని పేల్చారు. వీటిని కూడా తనకల్లు సమీపంలో మూతపడిన క్వారీ కోసం తెచ్చుకున్న నాలుగు నాటుబాంబుల్లో గుడి పేల్చాడానికి రెండింటిని ఉపయోగించారు. దీంతో మొలకలచెరువు మండలం మదనపల్లె రోడ్డు, తంబళ్లపల్లె క్రాస్ వద్ద ఉన్న సత్యసాయి జిల్లా, తనలకల్లు మండలం, టి. సదుం వాసి పెద్దన్న కుమారుడు నక్కల వెంకటనారాయణ, కొక్కంటి క్రాస్ వద్ద ఉన్న రెడ్డిబాష కుమారుడు షేక్ ఈదుల్లాను శుక్రవారం అరెస్టు చేశారు. కాగా ఇం దుకు వాడిన మారుతీ కారు, రెండు పెద్ద సమ్మెట్టలు, రెండు గడ్డపారలు, ఒక సుత్తి, రాళ్లు చెక్కే ఉలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో హరియాదవ్, లక్ష్మీనారాయణ, రాఘవేంద్రాచారి, మధు, మహేశ్వర్‌రెడ్డి నిందితులను 17న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మిగిలిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, ములకలచెరువు సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయిత్రి, పోలీసులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నుంచి పడి చత్తీస్‌ఘడ్ యువకుడికి తీవ్రగాయాలు

కురబలకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనులు జరుగుతున్న ఫ్లైఓవర్ నుంచి కిందపడి చత్తీస్‌ఘడ్ యువకుడు రవి(45)కి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగళ్ళు సమీపంలో బైపాస్‌రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ పని చేస్తున్న చత్తీస్‌ఘడ్ యువకుడు రవి ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడటంతో గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ అతడిని చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్‌కానిస్టేబుల్ వీఎం బాషా సస్పెండ్

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ వీఎం బాషాను సస్పెండ్ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో శివక్రిష్ణ స్థలం కొనుగోలు విషయంలో రామక్రిష్ణ, రామాంజనేయరెడ్డితో కలిసి హెడ్ కానిస్టేబుల్ బాషా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని ఫిర్యాదుపై కడప తాలుకా పోలీసుస్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదైంది. విచారించిన ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ బాషాను సస్పెండ్ చేశారు. గతంలో ఇతనిపై ఎర్రచందనం, భూ ఆక్రమణ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మరో కేసు నమోదు కావడంతో మరోమారు సస్పెండ్‌కు గురయ్యారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

● 96 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

సిద్దవటం, అక్టోబ రు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు చోరీల్లో నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అట్లూరు మండలం చలంగారిపల్లెకు చెందిన గుమ్మాల వెంకటసుబ్బయ్య, బద్వేల్ టౌన్ కుమ్మరి కొట్టాల్లో నివాసం ఉంటున్నారు. అన్నమయ్యజిల్లా అత్తిరాలకు చెందిన జి.కుమార్ అలియాస్ అమర్‌రాజ్‌కుమార్ ప్రస్తుతం కడప తిలక్‌నగర్‌లోని జగనన్నకాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ బైక్‌లో పారిపోతుండగా బాకరాపేట వద్ద అదుపులోకి తీసుకుని 96 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో విజయవా డ, తూర్పుగోదావరి, తిరుపతి, ప్రకాశం, మైదుకూరు, సుండుపల్లె ఓడీ చెరువు, కలువాయి, పొదలకూరుల్లో చోరీలకు పాల్పడ్డారని, వీరిపై 25 కేసులు ఉన్నట్లు తెలిపారు. గతంలో పీడీ యాక్టులో జైలుకు వెళ్లినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థిని ఎంపిక



కలకడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కలకడ గురుకుల పాఠశాల (బాలికలు) విద్యార్థిని బి.నిహారిక ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర, పీఈటీ రేవంత్‌కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమరిలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 ఫ్రీస్టయిల్ రెజిలింగ్ 65 కిలోల విభాగంలో విద్యార్థిని పాల్గొని మొదటి స్థానంలో నిలిచిందన్నారు. యాదమరిలోనే రాష్ట్రస్థాయి పోటీలు వచ్చేనెల 9, 10వ తేదీలలో జరుగుతాయని పీఈటీ తెలిపారు.

బంధాన్ని చిదిమేసిన క్షణికావేశం..

- కేసు పెట్టిన భార్య...ఉరి వేసుకున్న భర్త

బి.కొత్తకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): క్షణికావేశం ఓ బంధాన్ని చిదిమేసింది. పంతం ఓ పవిత్ర బంధాన్ని కకావికలం చేసింది. నిండు నూరేళ్లు అన్యోన్యంగా ఉండాల్సిన ఓ కుటుంబ అస్థిత్వం ఆదిలోనే ఆవిరైపోయింది. బి.కొత్తకోట నగరపంచాయతీ బాలసానిపల్లెకు వాసి పాలగిరి స్పందన(20)కు పుంగనూరు వాసి రాంబాబుతో వివాహమైంది. కొద్దిరోజులు వారి కాపురం సజావుగా సాగినా క్రమంగా అలజడి మొదలైంది. స్పందన పుట్టినిల్లు అయిన బాలసానిపల్లెలో వుండడంపై భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం బాలసానిపల్లెకు వచ్చి రాంబాబు భార్యతో గొడవ పడ్డాడు. ఈ ఘటనలో భార్య స్పందనకు గాయాలయ్యాయి. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి స్పందనను మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాంబాబు శనివారం తరిగోడు గ్రామ సమీపంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందాడు. విషయం బయటికి పొక్కడంతో సీఐ రాజారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

బి.కొత్తకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):రోడ్డుప్రమాదంలో చౌడమ్మ తీవ్రంగా గాయపడింది. మదనపల్లె పట్టణం నీరుగట్టివారిపల్లె వాసి రవి భార్య చౌడమ్మ కుటుంబీకులతో కలిసి బి.కొత్తకోటకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో తన తమ్ముడితో కలిసి మదనపల్లెకు బయలుదేరగా వాహనం కాండ్లమడుగు క్రాస్ వద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోబరు26:(ఆంధ్రజ్యోతి) కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శనివారం తమకు వచ్చిన సమాచారం మేరకు చీకలబైలు సమీపంలో నక్కలదిన్నెకు చెందిన శంకర్ నాయక్ కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆయనను అదుపులోకి తీసుకుని కర్ణాటక మద్యం ప్యాకె ట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

28మంది సారా విక్రయదారులు అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోబరు26:(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ, పరిసర ప్రాంతాల్లో సారా విక్రయదారులు 28 మందిని శనివారం అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ డి.కొండయ్యనాయుడు తెలిపారు. వారు వాడిన ఒక కారు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వారిని మదనపల్లె డీఎస్పీ కార్యాలయానికి తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మదనపల్లె డివిజన్‌లో అక్రమ మద్యం అమ్మకాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే తమ దృషికి తీసుకురావాలని తెలిపారు. మదనపల్లె డివిజన్‌లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గ్రామసభలో 115 అర్జీలు స్వీకరణ

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులికల్లు గ్రామంలో రీసర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం అధికారులకు 115 అర్జీలు అందాయి. వాటిలో విస్తీర్ణం సవరణ, జాయింట్ పీల్డ్ డివిజన్, జాయింట్ పీల్డ్ ముటేషన్, ముటేషన్ సవరణ, కోరిలేషన్ సవరణ, ఫొటో, మొబైల్‌నెంబర్ అప్‌డేట్, పట్టాదారు సవరణ సమస్యలను సవరించాలని కోరుతూ పలువు రు రైతులు రెవెన్యూ అధికారులకు అర్జీలను అందించారు. ఈ రెవెన్యూ గ్రామసభల్లో స్థానిక తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ధనంజయులు, మండల సర్వేయర్ శ్రీవాణి, వీఆర్వో వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాపై అధికారుల పరిశీలన



మదనపల్లె అర్బన్, అక్టోబ రు 26:(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇసుకనూతనపల్లె సమీపంలోని టీఎస్‌ఆర్ కాలనీ రహదారి కబ్జా విషయమై రెవెన్యూ అధికారులతోపాటు తాలుకా సీఐ కళా వెంకటరమణ పరిశీలించారు. కొండామరిపల్లె గ్రామ రెవెన్యూ సర్వేనెంబరు 93-4,100లో ఫేక్ పట్టాలు సృష్టించి లబ్ధిదారులను మోసం చేసి అక్రమంగా ప్లాట్లు వేసి రోడ్డు కూడా లేకుండా చేస్తున్నారని స్థానికులు శుక్రవారం రెవెన్యూ అధికారులకు, పోలీసులకు, మండల అభివృద్ధి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు శనివారం అక్కడికి చేరు కుని రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడ ఎలాం టి పనులు చేయరాదని హెచ్చరించారు. కాగా ప్రభుత్వ భూమి నిరుపేదలకు చెం దేలా చూడాలని స్థానికులు శనివారం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పీలేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పీలేరు మండల యూ టీఎఫ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌర వాధ్యక్షుడిగా అంజిరెడ్డి, అధ్యక్షుడిగా జి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శిగా పి.కుమార్ రాజా, సహాధ్యక్షులుగా మస్తాన్, నాగరత్నమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా పలువురిని జిల్లా కార్యదర్శు లుగా ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే.. ఇక అంతే..!



నిమ్మనపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నిమ్మనపల్లె బస్టాండు సమీపంలో ఉన్న కోటకిందమాలపల్లి రోడ్డు చినుకు పడితే అడుగు పెట్టాలంటేనే జనం హడలి పోతున్నారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పలు మార్లు స్థానిక సర్పంచ్‌కు కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం దళిత కాలనీల్లో కూడా రోడ్లువేసి ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి కోటకిందమాలపల్లి రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మత్తు పదార్థాల జోలికెళితే జీవితం ముగిసినట్లే..

కలికిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలపట్ల ఏమాత్రం ఆసక్తి కనబరిచినా అంతటితో జీవితం ముగిసినట్లేనని కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక కళాశాలల్లో డ్రగ్స్ దుష్పరిణామాలపై విద్యార్థులు అవగాహనా సదస్సులు నిర్వహించారు. కళాశాలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: మాదక ద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్‌టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాలను గుర్తిస్తూ ఎంచుకున్న లక్ష్యం దిశగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పెద్దప్పరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ మోసస్ అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు రిడో సంస్థ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకొంటున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్ర, ఈశ్వరయ్య, పివిరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయదారులు ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ధనంజయులు పేర్కొన్నారు. శనివారం మండలంలో దీపావళికి ఏర్పాటు చేసే బాణసంచా స్థలాలను మండల స్థాయి అధికారులతో ఆయన పరిశీలించి మాట్లాడుతూ బాణసంచా విక్రేతలు తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అధికారుల సూచించిన ప్రదేశాలలోనే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసి ప్రతి దుకాణం వద్ద రెండు అగ్నినిరోధక సిలెండర్‌ను, రెండు బకెట్ల ఇసుక, నీటిని అందుబాటులో పెట్టుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా బాణసంచా విక్రయాలు జరిగితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిప్పేస్వామి, ఆర్‌ఐ రామ్ ప్రసాద్, అగ్నిమాపక, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నేతలు

ములకలచెరువు/తంబళ్లపల్లె, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటిలో శనివారం జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును టీఎన్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు ఆధ్వర్యంలో పలువురు నేతలు కలిశారు. అనంతరం ఆయనను దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ములకలచెరువు సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం కూల్చేసిన ఘటనకు సంబంధించి నిందితులను 24 గంటల్లో పట్టుకోవడంపై ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నజీబ్, వెంకటశివ, చింటూ, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి స్ఫూర్తి ఫౌండేషన్ ఆసరా



విద్యార్థినికి ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కును అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థిని రేష్మాకు స్ఫూర్తి ఫౌండేషన్ స్పందించి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా రూ.75 వేల చెక్కును స్మార్ట్ ఫోనును శనివారం వితరణగా అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ వారు నిరుపేద విద్యార్థులను ఆదుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఫౌండర్ శ్రీవ్యాల్, తేజశ్విని ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ డైరెక్టర్ మరుపూరి హేమశేఖర్, అక్షర యజ్ఞం అసిస్టెంట్ డైరెక్టర్ స్వాతి, కో.ఆర్డినేటర్ చక్రపాణి పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

మదనపల్లె టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టరేట్ ఆవరణలోని చింత చెట్టు మీద పడి తీవ్రంగా గాయపడిన వృద్ధుడికి పలువురు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఐదు రోజుల క్రితం సబ్‌కలెక్టరేట్‌లోని చింతచెట్టు కూలి రోడ్డుమీద వెళుతున్న వృద్ధుడు చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వెన్నెముక, రెండు కాళ్లు విరిగిన చంద్రశేఖర్‌ను ఆయన కుమార్తెలు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఐదు రోజులవుతున్నా బాధితుడికి చికిత్సలు అందించకపోవడంతో విషయాన్ని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన బాధితుడి కుమార్తె భార్గవిని పిలిపించి డీఏవో పద్మావతి ఆధ్వర్యంలో తాత్కాలిక ఆర్థిక సహాయంగా రూ.10వేలు అందజేశారు. అంతే కాకుండా రుయా ఆస్పత్రి ఆర్‌ఎంవోకు ఫోన్ చేసి వృద్ధుడు చంద్రశేఖర్‌ను వెంటనే శస్త్రచికిత్స చేయించాలని కోరారు. అలాగే స్థానిక పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితుడు చంద్రశేఖర్‌కు రూ.10వేలు సహాయం అందించినట్లు మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం తెలిపారు.

గుట్టపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిశీలన

కలికిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుట్టపాలెం పంచాయతీ సి.బరిణేపల్లె వద్ద రూ. 2.15 కోట్లతో కొత్తగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను రాయచోటి సూపరింటెండింగ్ ఇంజినీరు ఆర్. చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. కొత్త సబ్ స్టేషన్‌కు విద్యుత్ చార్జింగ్ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త సబ్ స్టేషన్‌ను విద్యుత్ చార్జింగ్ చేసి సాంకేతికంగా కొంత కాలం పరిశీలనలో ఉంచాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు ఎంఆర్టీ ఈఈ రమేష్, టెక్నికల్ ఈఈ ఎస్.దామోదర్, కన్‌స్ట్రక్షన్ ఈఈ శ్రీనివాసులు, డీపీఈ దామోదర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చౌక దుకాణాల అవినీతిపై ఫిర్యాదు

వాల్మీకిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని చింతపర్తిగ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ రేషన్ చౌకదుకాణాలలో అవినీతి జరుగుతోందని మాజీ జిల్లా రైతు సంఘం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి శనివారం వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటికి ఫిర్యాదు చేశారు. చింతపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని 16, 17, 18, 19, 20 నెంబర్లు గల ప్రభుత్వ చౌక దుకాణాలతో పాటుగా మూగల మర్రి గ్రామం చౌకదుకాణం 27వ దుకాణంలో కూడా రేషన్ పంపిణీ అంతా అవినీతి మయంగా మారిపోయిందన్నారు. ఈ దుకాణాలలో 639కిలోల కందిపప్పు ఈనెల కోటాలో కార్డుదారులకు పంపిణీ చేయలేదని ఫిర్యాదు చేశారు. ఈవిషయమై గతవారం రోజుల వ్యవధిలో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం హెల్ప్ లైన్ నెంబర్ 1967కు కూడా రెండు సార్లు ఫిర్యాదు చేసినట్లు సుధాకర్ రెడ్డి తెలియజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ విచారణ జరిపి అవినీతికి పాల్పడినట్లు తేలితే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పశుగణన ప్రారంభం

పెద్దమండ్యం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పాడి రైతులకు సంప్రదించి పశు గణన చేపట్టాలన్నారు. ఈవోఆర్డీ జనార్ధన, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

11 మంది ఎన్యుమనేటర్లు

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని పశుగణనను చేపట్టేందుకు 11మంది ఎన్యుమనేటర్లను నియమించినట్లు మండల పశువైద్యాధికారి రమేష్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించి ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత రైతులను కలిసి వారి ఇంటిలో ఉన్న ప్రతి పెంపుడు జంతువుల వివరాలను నమోదు చేసుకుంటారన్నారు. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజకవర్గ స్థాయిలో టీడీపీ సభ్య త్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ క్రమశిక్షణ గల పార్టీ అని సభ్యత్వాల నమోదులో ఉమ్మడి చిత్తూరు జిల్లా కుప్పం తరువాత మదనపల్లె రెండో స్థానంలో నిలిచేలా కృషిచేయాలన్నారు. అనంతరం 9 మంది లైఫ్‌టైమ్ సభ్య త్వ నమోదు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు శివరామ్ ప్రతాప్, టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, ఎస్‌ఏ మస్తాన్, ఆర్‌కే రామకృష్ణాచారి, నాదెళ్ల శివన్న, షంషీర్, మోడెం సిద్ధప్ప, నీలకంఠ, కేహెచ్ ప్రశాంత్, జేవీ రమణ, ఎం. నాగయ్య, బాబా ఫక్రుద్దీన్, బెల్లె రెడ్డిప్రసాద్, విజయగౌడ్, రాజన్న పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న టీడీపీ నేత మల్లికార్జుననాయుడు

ములకలచెరువులో:తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు టీడీపీ సభ్యత్వ నమోదును ప్రాంభించారు. ములకలచెరువు టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, రాజంపేట మహిళా కార్యదర్శి గంగాదేవి, కురబలకోట మండల పార్టీ అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, నాయకులు కట్టా సురేంద్రనాయుడు, రవిచంద్ర, పాల రాము, ప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఫాస్టర్ శ్రీనివాసులు, కిట్టన్న, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం వాల్మీకిపురం పట్టణంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబునాయుడు, కూటమి నేతలు రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు బొక్కసం ఆనంద్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: టీడీపీతోనే ప్రజా సంక్షేమని పెద్దమండ్యం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలం లోని బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి లో టీడీపీ నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. పార్టీ నేతలు రామాంజులు నాయుడు, ఇస్మాయిల్(చింటు), రామాంజులు, సాంబ, మోహన తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో: రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వాలు తంబళ్ళపల్లె నియోజకవర్గంలో చేయడమే తమ లక్ష్యమని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్ళలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొగ్గు భాస్కర్, సురేంద్ర, రామచంద్ర, జీవరత్నం, రెడ్డిశేఖర్, రాజు. ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె టీడీపీ సభ్యత్వ నమోదును సమష్టి కృషితో జయప్రదం చేద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తంబళ్లపల్లె టీడీపీ నేత దాసిరిపల్లె జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తల సమావేశంలో ఆయన సభ్యత్వ నమోదు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసి ఉపాధ్యక్షుడు తులసీదర్ నాయుడు, మహిళా నాయకురాలు సిద్దమ్మ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరి శీన, రేపన బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ముమ్మరంగా జరిగింది. మండలంలోని పలు గ్రామాలలో సభ్యత్వ నమోదు చేయించారు. బీరంగి పంచాయతీలో మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆనంద, గోపి, జయరామిరెడ్డి, బంకుశ్రీనివాసులు, రమణ, శివారెడ్డి, శంకర, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

కాలనీ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

కలికిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీ ఇళ్లను లబ్ధిదారులు తొందరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో భానుమూర్తి రావు ఆదేశించారు. మదనపల్లె మార్గంలోని సీఎల్‌ఆర్సీ కాలనీ ఇళ్లను శనివారం ఆయన గృహనిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. రెండేళ్లు కావస్తున్నా ఇళ్లు పూర్తి కాకపోవడంపై కారణాలు గుర్తించాలని అధికారలకు సూచించారు. సమస్యలేవైనా ఉంటే వాటిని పరిష్కరించి ఇళ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ బి.చంద్రశేఖర్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మిట్స్ ఇంజనీరింగ్ విద్యార్థి ప్రతిభ

● విద్యార్థుల హాజరుపై వెబ్‌సైట్ ఆవిష్కరణ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

కురబలకోట, అక్టోబరు 26: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆటోమెటిక్ అటెండెన్స్‌కు సంబంధించి వెబ్‌సైట్, డెస్కటాప్ యాప్‌ను రూపొందించి ప్రత్యేక ప్రతిభ కనపరిచాడు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ విభాగానికి చెందిన మహ మ్మద్ ఉమర్ విభాగాధిపతి పద్మ, షాయిజ్ అహమ్మద్‌ల ఆధ్వర్యంలో ఈ యాప్‌ను తయారు చేశాడు. దీనిలో పైథాన్ డి జాంగ్ ఫ్రైమ్ వర్క్‌ను వినియోగించారన్నారు. దీనిలో రిజిస్ట్రేషన్ నంబరు, పాస్‌వర్డ్‌ను నమోదు చేయడం వలన కేవలం 30సెకనులలో విద్యార్థుల హాజరు నమోదుకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచుతుందన్నారు. దీని ద్వారా తల్లిదండ్రులు వారి పిల్లల అటెండెన్స్‌ను ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు సులభతరంగా తెలుసుకోవచ్చన్నారు. దీనిని కళాశాలలో ఉపయోగించే మిట్స్ జెమ్స్ హాజరు నమోదుకు వినియోగించినట్లు పేర్కొన్నారు. దీనిని రూపొందించిన విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, విభాగాధిపతి పద్మ, షాయిజ్ అహమ్మద్ తదితరులు అభినందించారు.

మిట్స్ ప్రిన్సిపాల్‌కు ఐఎస్‌టీఈ బెస్ట్ అవార్డు



ఐఎస్‌టీఈ బెస్ట్ అవార్డును మిట్స్ ప్రిన్సిపాల్ సి.యువరాజ్‌కు అందజేస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు

కురబలకోట, అక్టోబరు 26: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్‌కు ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన ల్(ఐఎస్‌టీఈ) బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డును జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు అందజేశారు. కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆయన నాణ్యమైన విద్యాప్రమాణాలు, రీసెర్చ్ ఫండింగ్, నాక్ ఏ ప్లస్ తదితర వాటిని పరిగణలోకి తీసుకుని అవార్డును ప్రదానం చేశారు. కాగా కళాశాలలో ఈఈఈ విభాగానికి చెందిన భార్గవి, సీఎస్ఈ విభాగానికి చెందిన కార్తీక్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో బెస్ట్ స్టూడెంట్ ఇన్నోవేటర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డులను కర్నూల్ పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. కాగా అవార్డులను సాధించిన ప్రిన్సిపాల్, విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ తదితరులు అభినందించారు.